www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

Published From : Vijaywada - Hyderabad - Delhi - Bengaluru
శుక్రవారం 11, జూలై, 2025 | పేజీలు :12

# పవన్ ఆదేశాలతో దేవాడ మాంగనీస్ గనిలో అధికారుల తనిఖీలు





### దేవాడ మైనింగ్ బ్లాక్‌లో ఉన్నతాధికారుల దాడులు

### పలు విషయాలపై ఆరా తీసిన అధికారులు

### ఓ నివేదికను డిప్యూటీ సీఎం కార్యాలయానికి పంపనున్న అధికారులు

**చీపురుపల్లి:**
విజయనగరం జల్లా గరివిడి మండలం దేవాడలోని మహాలక్ష్మి మినరల్స్ మైనింగ్‌లో గురువారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు మెరుపు దాడులు చేశారు. దేవాడ మైనింగ్ బ్లాక్‌లో నిబంధనలకు విరుద్ధంగా మాంగనీస్ తవ్వుతున్నట్లు డిప్యూటీ సిఎం కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో.. పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికారులు తనిఖీలు చేశారు. దీంతో మైనింగ్ అనుమతులు, రాయల్టి చెల్లింపులు, ఖనిజం తవ్వకాలపై ఆరా తీశారు అధికారులు. మైనింగ్ ఎంత విస్తీర్ణంలో తీసుకున్నారు? మైనింగ్ నుంచి వస్తున్న రా మెటీరియల్ ఎక్కడ వేస్తున్నారు? మైనింగ్ నుంచి వస్తున్న మెటీరియల్ ఎక్కడ విక్రయిస్తున్నారు? ఎప్పుడు లీజుకు తీసుకున్నారు? తదితర విషయాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కలెక్టర్ మురళి, మైనింగ్ శాఖ ఆర్ఐ రాంబాబు, తహశీల్దార్ బంగార్రాజు పాల్గన్నారు. డిప్యూటీ సిఎం ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని, దీనిపై ఓ నివేదికను డిప్యూటీ సిఎం కార్యాలయానికి పంపినున్నట్లు అధికారులు తెలిపారు.
విజయనగరం జిల్లా గరివిడి మండలం దేవాడ మైనింగ్ బ్లాక్‌లో ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా తవ్వకాలు చేపడుతున్నారని డిప్యూటీ సీఎంకు ఫిర్యాదులు చేశారు. దేవాడ మైనింగ్ బ్లాక్‌లో అనుమతికి మించి సాగిస్తున్న మాంగనీస్ తవ్వకాలపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆరా తీశారు. మాంగనీస్ తవ్వకాలు, అనుమతులిచ్చిన విధానం, ఈవేలం ప్రక్రియ, ప్రజాభిప్రాయ సేకరణలో వచ్చిన అభ్యంతరాలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఉపముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఆదేశించింది. దేవాడ బ్లాక్‌లో ఏడాదికి పది లక్షల టన్నుల మాంగనీస్‌ను తవ్వాల్సి ఉండగా అంతకు మించి తవ్వుతున్నారని, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదని ఫిర్యాదులు అందడంతో పవన్‌కల్యాణ్ స్పందించారు.



# పవన్ కళ్యాణ్ సవాల్.. నేను సిద్ధమన్న లోకేష్!

### మెగా పీటీఎం వేదికగా ప్రకటించిన నారా లోకేష్

### కోటి మొక్కలు నాటాలని గతంలో పవన్ సవాల్

### పవన్ అన్న సవాల్ స్వీకరిస్తున్నానన్న మంత్రి లోకేష్

### ఒక్క విద్యాశాఖలోనే కోటి మొక్కలు నాటుతామని ప్రకటన

**శ్రీసత్యసాయి జిల్లా:**
డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల చేసిన సవాల్ ను స్వీకరిస్తున్నట్టు మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ లో సీఎం చంద్రబాబుతో కలిసి నారా లోకేష్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారని.. ప్రధాని పిలుపు మేరకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూడా కోటి మొక్కలు నాటాలని సవాల్ విసిరారు.
తన అన్న సమానుడైన పవనన్న సవాల్‌ను స్వీకరిస్తున్నట్టు లోకేష్ ప్రకటించారు. ఒక్క విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతామని లోకేష్ ప్రకటించారు. మూడేళ్లు ఆ మొక్కలను పెంచే బాధ్యత పిల్లలు తీసుకుంటారన్నారు. పిల్లలకు గ్రీన్ పాస్ పోర్టు ఇచ్చాం. పిల్లలకు మొక్కలను పెంచడం బాధ్యతగా భావించాలి. మూడేళ్ల తర్వాత గ్రీన్ పాస్ పోర్టుపై స్కూల్ ప్రిన్సిపల్ సంతకం పెడతారని లోకేష్ తెలిపారు.
కొద్ది రోజుల క్రితం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అమరావతిలోని అనంతవరంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా వచ్చే ఏడాది ఇదే రోజు నాటికి రాష్ట్రంలో కనీసం కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నానని పవన్ ప్రకటించారు. మేం మొక్కలు నాటుతున్నాం.. మీరు నాటేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు. ఇప్పుడు ఆ చాలెంజ్‌ను లోకేష్ స్వీకరించారు. పర్యావరణహితమైన కార్యక్రమంపై పవన్ చేసిన సవాల్ లోకేష్ స్వీకరించి ప్రజలకు మంచి సందేశాన్ని ఇచ్చారని పార్టీ నేతలు కూడా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఈనెల 16న రాష్ట్రంలో మెగా జాబ్ మేళా

- **అధికారికంగా ప్రకటించిన మంత్రి కొల్లు రవీంధ్ర**
- **జాబ్ మేళా పోస్టర్ విడుదల**
- **జాబ్ మేళాలో పాల్గొననున్న దాదాపు 30 ప్రముఖ కంపెనీలు**



**మచిలీపట్నం:**
రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న భారీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర అధికారిక ప్రకటన చేశారు. ఈ జాబ్ మేళాకు సంబందించిన పోస్టర్ ను గురువారం విడుదల చేశారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పుకోచ్చారు. దాదాపు 30 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ జాబ్ మేళాలో ఇంటర్వ్యూ ఎలా ఉండబోతుందో తెలియడానికి జులై 13 నుంచి 15 వరకు ప్రముఖ నేషనల్ కాలేజీలలో శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. మేఘా కంపెనీ, ఆక్వా రంగంలో ఉన్న ప్రసిద్ధ కంపెనీలను కూడా జాబ్ మేళాకు ఆహ్వానిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ జాబ్స్ కోసం 800 మంది RAMP ద్వారా రిజిస్టర్ చేసుకున్నారని, వారిని పారిశ్రామికంగా అభివృద్ధి సాధించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. MSME, PM Vishwakarma లాంటి పథకాలను సద్వినియోగం చేసుకుంటూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం చెప్పుకొచ్చారు. ఈ జాబ్ మేళా వివరాలను సచివాలయ సిబ్బంది గడపగడపకు వెళ్లి వివరించాలని, పార్టీ నాయకులు సైతం ప్రజలకు అవగాహన కల్పించాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.



## ఏపీలో జనగణనకు ప్రభుత్వం పచ్చ జెండా

**అమరావతి:**
ఏపీలో జనగణన చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జనగణన నోటిఫికేషన్ ను తిరిగి ప్రచురించింది. దీనికోసం ఈ ఏడాది జూన్ 16న కేంద్రహోంశాఖ నోటిఫికేషన్ ఇచ్చింది. 2027 మార్చి 1 నుంచి దేశవ్యాప్తంగా జనగణన ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనూ అదే రోజు ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎస్. రావత్ ఆదేశాలు జారీ చేశారు. 2027లో దేశవ్యాప్తంగా జనగణన నిర్వహించాలని కేంద్రం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

## ఈనెల 14న ఢిల్లీకి సీఎం చంద్రబాబు!

- **బనకచర్లతో పాటు పలు అంశాలపై మోదీతో భేటీ**
- **రాష్ట్రానికి ఆర్థిక సాయం, పలు ప్రాజెక్టులపై కేంద్రమంత్రులను కలవనున్న సీఎం**

**అమరావతి:**



ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈనెల 14న మళ్లీ ఢిల్లీ వెళ్లనున్నారు. బనకచర్లతో పాటు తెలంగాణచేస్తున్న ఇతర అభ్యంతరాలపై ఆయన ప్రధాని మోడీతో మాట్లాడనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14న హస్తినకు వెళ్తున్నట్లు సమాచారం. బనకచర్లపై తమ ప్రతిపాదనలను కూడా ప్రధాని మోడీ ఎదుట ఉంచనున్నారు. అలాగే రాష్ట్రానికి ఆర్థిక సాయం చేయాలని కోరనున్నారు. మోడీ అపాయింట్ మెంట్ నేపథ్యంలో రెండు, మూడు రోజులు అక్కడే ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. అలాగు కేంద్రమంత్రులతోనూ ఆయన భేటీ అవుతారని అధికార యంత్రాంగం చెబుతోంది. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే లక్ష్యంతో గోదావరి నదిపై రాష్ట్ర ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు కడుతున్న విషయం తెలిసిందే. సముద్రంలో వృధాగా పోయే నీళ్లను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కొన్ని అంశాలపై ఏపీ ప్రభుత్వం కేంద్ర జల సంఘం వివరణ కోరిన నేపథ్యంలో చంద్రబాబు టూర్ ఆసక్తికరంగా మారింది.

# స్కూల్స్ పవిత్ర దేవాలయాలు

### ఉపాధ్యాయుడిగా మారిన సీఎం

### మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో పాల్గొన్న సీఎం, మంత్రి




చదువుతోనే కొత్త ఆవిష్కరణలు సాధ్యమవుతాయని సీఎం చంద్రబాబు చెప్పారు. శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులోని జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరయ్యారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలిచ్చారు. తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కొత్తచెరువు జడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమానికి హాజరైన చంద్రబాబుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తర్వాత విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యార్థుల చదువుతున్న తీరుపై ఆరా తీశారు. పిల్లల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఒక్కొక్క తరగతి గదిని పరిశీలించిన సీఎం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. డిజిటల్ తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. 8వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సమయంలో మంత్రి లోకేశ్ పిల్లలతో కలిసి కూర్చొని శ్రద్ధగా పాఠం విన్నారు. విద్యార్థులకు పాఠం బోధించిన అనంతరం సీఎం చంద్రబాబు పిల్లలను ప్రశ్నలు అడిగారు. పిల్లల సందేహాలను నివృత్తి చేశారు. భవిష్యత్తులు ఎలా ఎదగాలనుకుంటున్నారనే విషయాన్ని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. జీవితాలు బాగు పరుచుకునేందుకు బాగా చదువుకోవాలని స్టూడెంట్స్‌కి సూచించారు. విద్యార్థులు చేసిన సైన్స్ నమూనాలను పరిశీలించారు. మరింతగా ఉన్నతంగా ఎదగాలని ప్రోత్సహించారు. స్కూల్స్ పవిత్ర దేవాలయాలని పిల్లల్ని తీర్చిదిద్ది జ్ఞానాన్ని అందించే పుణ్యక్షేత్రాలని సీఎం చంద్రబాబు అన్నారు. పేరెంట్స్ మీట్ ఏర్పాటు చేయాలని 1998లో తాను అనుకున్నట్లు చెప్పారు. చదువుకుని పైకి వచ్చిన వారు స్కూళ్లకు ఎంతోకొంత చేయూత ఇవ్వాలని పిలుపునిచ్చారు. మగ పిల్లల కంటే ఆడపిల్లలు తక్కువ కాదన్న సీఎం అందుకే ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం ఇచ్చామన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందజేస్తున్న తల్లికి వందనంతో ఎంతో మంది జీవితాలు మారుతున్నాయని విద్యార్థులు అన్నారు. కొత్తచెరువు జడ్పీ పాఠశాల పీటీఎంలో పాల్గొన్న విద్యార్థులు తాము చూసిన అనుభవాలను సీఎం చంద్రబాబుతో పంచుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టడం వల్ల తమలాంటి పేదవారికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.
అనంతరం శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తి సత్యసాయి మహాసమాధిని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు దర్శించుకున్నారు. వారి వెంట మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, సవిత ఉన్నారు.



# 'ఏఐ'తో దోమలు కంట్రోల్ చేస్తారా ? :మాజీ మంత్రి బుగ్గన సెటైర్లు

- **కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా మాజీ మంత్రి బుగ్గన ప్రశ్నలు..**
- **2,45,000 కోట్ల బడ్జెట్ ఏమైంది.. అప్పులపై అడిగితే దేశద్రోహులమా?**
- **ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ ఇచ్చారా?. దీపం ఎంత మందికి వచ్చింది?**

**హైదరాబాద్:**
రాష్ట్రానికి తెచ్చిన అప్పులు ఎక్కడికి పోతున్నాయని..2,45,000 కోట్ల బడ్జెట్ ఏమైందని మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ సూటిగా ప్రశ్నించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉండి కూడా రాజధానిని ఎందుకు అభివృద్ధి చేయడం లేదని నిలదీశారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సంపద సృష్టించాల్సిన కూటమి ప్రభుత్వం ఎందుకు అప్పులు చేస్తుందని అడిగతే మేము దేశద్రోహులమా?. మీ అసమర్థతను కప్పి పుచ్చుకోవడానికి మాపై బురద చల్లడం ఎందుకు? అంటూ మాజీ మంత్రి ధ్వజమెత్తారు.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు, మామిడి, మిర్చి రైతుల పరిస్థితి ఏంటి?. ఉద్యోగులకు పీఆర్సీ ఏర్పాటు చేశారా?. ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇచ్చే పరిస్థితి ఉందా?. ఏడాది పాలనలో ఒక్క డీఏ అయినా ఇచ్చారా? తల్లికి వందనం ఎంతమందికి ఇచ్చారు?. ఉచిత బస్సు ప్రయాణం అని హామీ ఇచ్చి ఇప్పుడు జిల్లాల వరకే అంటూ షరతులు పెడతారా అని నిలదీశారు. డబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ ఇచ్చారా?. దీపం ఎంత మందికి వచ్చంది?. చెప్పాలన్నారు. ఖనిజాభివృద్ధి సంస్థ నిధులను కొల్లగొట్టడం దారుణమన్నారు. రాష్ట్ర ఖజానా నుంచి నిధులు తీసుకునేలా ప్రైవేట్ వ్యక్తులకు హక్కులు కల్పించడాన్ని ఏవిధంగా కూటమి ప్రభుత్వం సమర్థించుకుంటుందని అడిగారు. రాజ్యాంగ పదవిలో ఉండి, లక్ష్యంగా చేసుకుని గత ప్రభుత్వంపై రకరకాల మనుషులు మెయిల్స్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**'ఏఐ'తో దోమలు కంట్రోల్ చేస్తారా? : బుగ్గన సెటైర్లు**
కూటమి ప్రభుత్వం పవర్ పీపుల్ కదా అంటూ హుద్ హుద్ కూడా ఆపగలిగిన శక్తి ఉన్నవారంటూ మాజీ మంత్రి బుగ్గన చురకలంటించారు. ఏఐ ద్వారా దోమలను కంట్రోల్ చేయగలిగిన వారంటూ సెటైర్లు వేశారు. కరవును సైతం ఆపగలిగిన వారంటూ వ్యంగ బాణాలు సంధించారు. అప్పు చేయడం కరెక్టా కాదా సూటిగా చెప్పాలన్నారు. గత ప్రభుత్వం కోవిడ్ వల్ల తప్పి పరిస్థితుల్లో అప్పు చేస్తే తప్పని.. ఇపుడు మాత్రం తప్పే కాదనేలా అప్పుల మీద అప్పులు చేస్తున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.10వేల కోట్ల అప్పులు ఒకేసారి చేస్తున్నారన్నారు. రూ.5 లక్షల కోట్ల అప్పుని గతంలో శ్రీలంక, వెనిజులా అంటూ రూ.14లక్షల కోట్ల అప్పుయినట్లు దుష్ప్రచారం చేసిన వైనంపై మాజీ మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.



# మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న మా కుమారుల్ని రక్షించండి

- **ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి మహిళ వినతి**
- **సమస్యను విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ దృష్టికి తీసుకువెళ్లిన పవన్ కళ్యాణ్**

**మంగళగిరి:**
ఉద్యోగాల కోసం ప్రయత్నించి ఏజెంట్ చేతిలో మోసపోయి విదేశాల్లో మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో మగ్గుతున్న తమ కుమారులను రక్షించాలంటూ గండబోయిన సూర్యకుమారి అనే మహిళ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ విజ్ఞప్తి చేసింది. ఈమేరకు పవన్ కళ్యాణ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. విజయనగరానికి చెందిన ఆమె- మయన్మార్ సరిహద్దుల్లో బందీలుగా ఉన్న తమ వారి ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయని, వారిని విడిపించేందుకు సాయం చేయాలని వేడుకున్నారు. పవన్ కళ్యాణ్ ని కలసి.. తమ ఇద్దరు కుమారులతోపాటు 8 మంది మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో ఉన్నట్టు వివరించారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం ఈ విషయాన్ని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మానవ అక్రమ రవాణా ముఠాల చెరలో చిక్కుకున్న వారిని రక్షించాలని కోరారు. ఈ వ్యవహారంపై విదేశీ వ్యవహారాల శాఖ సానుకూలంగా స్పందించింది. విదేశాల్లో మగ్గుతున్న వారిని వెనక్కి తీసుకురావడానికి తగిన హామీ ఇచ్చారు.

# వాహనదారులకు తీపి కబురు చెప్పిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం!

- **గ్రీన్ టాక్స్‌పై కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం!**



ఆంధ్రప్రదేశ్‌ప్రభుత్వం వాహనదారులకు తీపికబురు చెప్పింది. రాష్ట్రంలోని రవాణా వాహనదారులకు కూటమి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం విధించిన గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. జులై 9న అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులూ ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రీన్ టాక్స్ తగ్గించేందుకు సంబంధించిన ఆర్డినెన్స్‌ను క్యాబినెట్ ఆమోదించింది. ఈ నిర్ణయంతో సరకు రవాణా వాహనదారులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా పర్యావరణానికి హాని కలగదని కాలుష్యం పెరగదని భావిస్తున్నారు.
గతంలో ఏడాదికి రూ.20 వేల వరకు ఉన్న పన్నును తాజా నిర్ణయంతో ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.3 వేలకు తగ్గించారు. గ్రీన్ ట్యాక్స్ ద్వారా జిల్లాలో ఏటా రూ.18 కోట్లు ఆదాయం వచ్చేది. రవాణా వాహనాలకు ఏడేళ్ల కాలపరిమితి దాటితే గ్రీన్ ట్యాక్స్ అమలు చేస్తారు. గత ప్రభుత్వం ఒకేసారి రూ.15 వేలకు పెంచేసింది. కేంద్రం కాలం చెల్లిన వాహనాల సంఖ్యను తగ్గించడానికి గ్రీన్ ట్యాక్స్ పెంచే అవకాశం ఇచ్చింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో గ్రీన్ ట్యాక్స్‌ను బాగా పెంచింది. గతంలో ఏడేళ్లు దాటిన సరకు, ప్రజా రవాణా వాహనాలకు ఏడాదికి రూ.200 ఫీజు ఉండేది. కానీ గత ప్రభుత్వం దానిని మార్చి ఎక్కువ పన్నులు వేసింది. 710 ఏళ్ల వాహనాలకు సగం త్రైమాసిక పన్ను, 1012 ఏళ్ల వాహనాలకు ఒక త్రైమాసిక పన్ను, 12 ఏళ్లు దాటిన వాహనాలకు రెండు త్రైమాసికాల పన్నులు వసూలు చేసే విధానాన్ని 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. దీనివల్ల వాహనదారులపై చాలా భారం పడింది. లారీ యజమానులు చాలా ఇబ్బంది పడ్డారు. వైకాపా ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా పన్ను తగ్గించలేదు.
ప్రజా రవాణా వాహనాలకు (బస్సులు, క్యాబ్స్) గతంలో హరిత పన్ను రూ.200 ఉండగా.. గత ప్రభుత్వం రూ.4 వేల నుంచి రూ.6 వేల వరకు పెంచింది. ఇప్పుడు తెలంగాణలో ఉన్న విధంగానే ఏపీలో కూడా గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించనున్నారు. తెలంగాణలో 712 ఏళ్ల వాహనాలకు ఏడాదికి రూ.1,500, 12 ఏళ్లు దాటిన వాహనాలకు రూ.3 వేలు మాత్రమే గ్రీన్ ట్యాక్స్‌గా తీసుకుంటున్నారు. తెలంగాణలో ఎలా ఉందో.. అదే విధంగా ఏపీలో కూడా పన్ను వసూలు చేయాలని ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ప్రజా రవాణా వాహనాలకు కూడా ఇదే పన్ను విధానం వర్తిస్తుంది.
గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు గ్రీన్ ట్యాక్స్ తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికలకు ముందు లారీ యజమానుల సంఘాలతో చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్‌లు గ్రీన్ ట్యాక్స్ తగ్గించి ఊరట కల్పిస్తామన్నారు.. ఇప్పుడు తాజాగా ఆ హామీని నిలబెట్టుకున్నారు. ఈ నిర్ణయంతో రవాణా రంగంలో ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది అంటున్నారు. పన్ను భారం తగ్గడం వారికి ఎంతో లాభం. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. దీనివల్ల రవాణా రంగం మరింత అభివృద్ధి చెందుతుందనంలో సందేహం లేదు.

**ఎలక్ట్రిక్ స్కూటర్ ధరలపై ప్రభావం**
ఉదాహరణకు, మీరు రూ.70,000 ధర గల ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆంధ్రప్రదేశ్‌లో కొంటే.. దాని ఎక్స్‌షోరూమ్ ధరతోపాటూ.. గ్రీన్ టాక్స్, రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు, ఇతర ఛార్జీలు అదనంగా ఉంటాయి. సాధారణంగా ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్ 9% నుంచి 12% వరకు ఉంటుంది, గ్రీన్ టాక్స్ రూ.3,000 వరకు ఉండవచ్చు. ఇతర ఫీజులు (రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్) కలిపి సుమారు రూ.10,000 అదనంగా ఉండవచ్చు.

# టీవీలో వేసినా వదలకుండా చూడాల్సిందే! నేటికి పదేళ్లయినా 'బాహుబలి'కి అదే క్రేజ్!

సరిగ్గా పది సంవత్సరాల క్రితం అంటే 2015 జూలై 10 సరిగ్గా ఇదే రోజు ప్రపంచవ్యాప్తంగా 'బాహుబలి ది బిగినింగ్' సినిమా రిలీజయింది. ప్రభాస్ హీరోగా టాలీవుడ్ లో కనుమరుగైపోయిన పురాతన జానపద వీరుల ఫిక్షన్ కథతో, వందలాది కోట్లు ఖర్చు పెట్టి ఈ సినిమా తీయడం గురించి రిలీజ్ కు ముందు వరకు ఇండస్ట్రీలో ఎన్నో నెగటివ్ కామెంట్స్ వినిపించాయి. ప్రకటన దశ నుంచి మూడేళ్ళకు పైగా నిర్మాణంలో ఉన్న ఈ విజువల్ గ్రాండియర్ లో ప్రభాస్ హీరోగా నటించడం , ప్యాన్ ఇండియా స్టార్ గా మారిపోవడం వెనువెంటే జరిగిపోయాయి. టాలీవుడ్ నే కాదు యావత్ సినీ పరిశ్రమనే ప్రభావితం చేసే ఒక చరిత్రకు బాహుబలి ది బిగినింగ్ సాక్ష్యంగా నిలిచింది.

బాహుబలి లాంటి అద్భుతాన్ని తీయాలన్న ఆలోచన రాజమౌళికి చందమామ పుస్తకాల అవపోసన పట్టిన సమయంలోనే వచ్చింది. దాన్ని తండ్రి రచయిత విజయేంద్ర ప్రసాద్ తో పంచుకుంటే శివగామి, కట్టప్ప పాత్రలతో మొదలుపెట్టి రామాయణంలో రాముడి లక్షణాలున్న అమరేంద్ర బాహుబలిని సృష్టించారు. తండ్రి మరణానికి కొడుకు ప్రతీకారం తీర్చుకోవడమనే పాత పాయింట్ ని తీసుకుని దాన్ని ఊహించని మలుపులు ముడిపెట్టి, వెన్నుపోటు పొడవడం ద్వారా కనివిని ఎరుగని ఒక గొప్ప ఎక్స్ పీరియన్స్ ఇవ్వడంలో జక్కన్న సాధించిన విజయం ఒక మరవలేని కావ్యఖండం. సాహసంతో తెరకెక్కించిన బాహుబలి సినిమాని క్లాసు మాస్ తేడా లేకుండా బ్రహ్మరథం పట్టారు.
అప్పటిదాకా ఒక లెక్క బాహుబలి నుంచి ఒక లెక్కలా తెలుగు సినిమా గమనం మారిపోయింది. బాలీవుడ్ ఖాన్లు ఈర్ష్య పడేలా, తలలు పండిన సినీ పెద్దలు విభ్రాంతికి గురయ్యేలా దేశ దేశాల్లో బాహుబలి వందల కోట్లు వసూలు చేయడం సువర్ణాక్షరాలతో శాశ్వతంగా లిఖించబడింది. ఈ సినిమాలోని అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలి (శివుడు) పాత్రల్లో ప్రభాస్, భల్లాలదేవుడి పాత్రలో రానా, దేవసేనగా అనుష్క, అవంతికగా తమన్నా, శివగామిగా రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్, బిజ్జలదేవగా నాజర్ కనిపిస్తారు. ముందు శివగామి పాత్రకు శ్రీదేవిని, కట్టప్ప పాత్రకు సంజయ్ దత్‌ను, భల్లాలదేవుడి పాత్రకు జేసన్ మమోవా (హాలీవుడ్ మూవీ 'ఆక్వామేన్' ఫేమ్)లను అనుకున్నారు కానీ కుదరలేదు. అయితే శివగామిగా రమ్యకృష్ణ, కట్టప్పగా సత్యరాజ్ ఎంత సరిగ్గా సరిపోయారో, బాహుబలికి యాంటీ రోల్ అయిన భల్లాలదేవ పాత్రకు రానా ఎంత ఫిట్ అయ్యారో చూశాం. అమరేంద్ర బాహుబలి, మహేంద్ర బాహుబలిగా ప్రభాస్ తప్ప ఎవరూ సూట్ కాదని ప్రేక్షకులు ప్రశంసించారు. అనుష్క, తమన్నా, నాజర్‌ల నటన సూపర్. అందుకే 14నంది అవార్డులు, జాతీయ పురస్కారం, లెక్కలేనన్ని ప్రైవేట్ అవార్డులు ఎన్నో బాహుబలిని అలంకరించాయి.

ఈ సినిమాలో కాలకేయుడు (ప్రభాకర్) మాట్లాడే కిలికిలి భాష అప్పట్లో ఓ హాట్ టాపిక్. ఇప్పటికీ ఈ భాష గురించి సరదాగా మాట్లాడేవారు ఉన్నారు. ఈ భాషను రచయిత మధన్ కార్కీ సృష్టించారు. ఈ భాషలో దాదాపు 700 పదాలు, 40 వ్యాకరణ నియమాలు ఉన్నాయట. 'బాహుబలి' సినిమాలోని మాహిష్మతి సామ్రాజ్యాన్ని ఇరవై ఎకరాల విస్తీర్ణంలో, సుమారు రూ. 25 కోట్లతో ఏర్పాటు చేశారు. అలాగే ఈ సినిమాలోని గ్రాఫిక్స్ కోసం పదిహేనుకు పైగా స్టూడియోలు, ఐదొందల మందికి పైగా వీఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు శ్రమించాల్సి వచ్చిందట. ఇక కేకే సెంథిల్‌కుమార్ సినిమాటోగ్రఫీ, కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటింగ్, వి. శ్రీనివాస్‌మోహన్ విజువల్ ఎఫెక్ట్స్, కీరవాణి సంగీతం ఈ సినిమాకు ప్లస్ అయ్యాయి.




దాదాపు రూ. 150 కోట్లకు పై బడ్జెట్‌తో రూపొందిన 'బాహుబలి: ది బిగినింగ్' ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 600 కోట్ల వసూళ్లు సాధించి, 2015లో ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. అలాగే అప్పటికి అత్యధిక వసూళ్ళు సాధించిన రెండో భారతీయ చిత్రంగా రికార్ట్ సాధించింది. ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్ళు రాబట్టిన తొలి పది తెలుగు చిత్రాల్లో 'బాహుబలి: ది బిగినింగ్' పేరు ఉంది.

తెలుగు సినిమా 'గ్లోబల్ రేంజ్'కి ఎదిగింది 'బాహుబలి'తోనే. ఒక రకంగా 'పాన్ ఇండియా' ట్రెండ్ ఆరంభమైనదే 'బాహుబలి'తో అని చెప్పడం తెలుగువారు గర్వించే విషయం.

రెండు భాగాలుగా అలరించిన బాహుబలి ఇప్పుడు ఒకే పార్ట్ గా మీ ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. 'బాహుబలి: ది ఎపిక్ (Baahubali The Epic) పేరుతో ఇది రిలీజ్ కానుంది. ప్రపంచవ్యాప్తంగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది' అని పోస్ట్ పెట్టారు. అది కూడా తెలుగు, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో ఇది విడుదల కానుంది. దీంతో ఈ సినిమా మరోసారి చరిత్ర సృష్టించి.. రీ రిలీజ్ లో రికార్డు సొంతం చేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఈ స్పెషల్ సందర్భాన్ని పురస్కరించుకుని మేకర్స్ 'బాహుబలి - ది ఎపిక్' అనే కొత్త టైటిల్‌తో ఈ చిత్రాన్నికి సంబంధించి పోస్టర్ కూడా విడుదల చేశారు.



# గురుకులాల్లో చదివే విద్యార్థులకు మంత్రి గుడ్ న్యూస్

- **గురుకులాలు, గిరిజన, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థుల విషయంలో మంత్రి కీలక నిర్ణయం**
- **నారాయణ విద్యా సంస్థల్లో ఐఐటీ, నీట్ ఉచిత కోచింగ్**

**అమరావతి:**

గురుకులాలు, గిరిజన, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థులకు మంత్రి నారాయణ గుడ్ న్యూస్ చెప్పారు. గురుకులాలు, గిరిజన, ఎస్సీ హాస్టళ్ల విద్యార్థుల విషయంలో మంత్రి నారాయణ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆయా విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల్లో ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఐఐటీ, నీట్‌లో అతి కొద్దిమార్కుల తేడాతో సీట్లు సాధించలేకపోయిన విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల్లో ఐఐటీ, నీట్ లాంగ్ టర్మ్ ఉచిత కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. మంత్రి డీబీవీ స్వామితో ఏపీ సచివాలయంలో చర్చలు జరిపిన అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఐఐటీ, నీట్ లో స్వల్ప మార్కుల తేడాతో సీట్లు రీని విద్యార్థులకు నారాయణ విద్యా సంస్థల్లో ఫ్రీ గా కోచింగ్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కోచింగ్ సమయంలో విద్యార్థులు ఫ్రీ భోజనం, ఫ్రీ హాస్టల్ సౌకర్యాలు కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఏడాది 80 మంది విద్యార్థులకు కోచింగ్ ఇవ్వనున్నట్లు నారాయణ తెలిపారు. శిక్షణ కాలంలో విద్యార్థులకు మెటీరియల్, బోధనా సిబ్బందిని నారాయణ విద్యాసంస్థలు ఉచితంగా అందిస్తాయని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే పేద విద్యార్థులకు సహకారం అందిస్తోన్న నారాయణకు డోలా బాల వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.



# నల్లపురెడ్డి సవాల్

**కోవూరు:**

కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డిచేసిన వ్యాఖ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై సీరియస్‌గా స్పందించారు ప్రసన్నకుమార్‌రెడ్డి. గురువారం నెల్లూరులో ప్రసన్నకుమార్ రెడ్డి విలేకర్లతో మాట్లాడారు. పోలీసులకు ఓపెన్ ఛాలెంజ్ చేశారు. తాను ఎక్కడికీ వెళ్లిపోలేదని, ఎక్కడో దాక్కున్నట్లు కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పుడైనా సరే తనను అరెస్ట్ చేసుకోవచ్చన్నారు. తాను భయపడటం అనేది తమ బ్లడ్‌లోనే లేదని, నెల్లూరు వదిలి ఎక్కడికీ పారిపోలేదని చెప్పారు. తను నెల్లూరు వదిలి పారిపోయానని ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చేతి నొప్పి వల్ల చెన్నై ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని వచ్చానని ప్రసన్న కుమార్ రెడ్డి పేర్కొన్నారు. తమ ఇంటి వద్ద దాడి చేసిన వారి వీడియోలున్నాయని పోలీసులు దర్యాప్తు జరపాలని కోరారు. నాది నల్లపరెడ్డి శ్రీనివాసులరెడ్డి రక్తం. భయపడటం అనేది మా బయోడేటాలోనే లేదు" అంటూ వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు



# విజయసాయిరెడ్డికి సిట్ మరోసారి నోటీసులు

- **ఈనెల 12వ తారీఖున విచారణకు రావాలంటూ నోటీసులు**
- **గతంలో కేసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి వివరాలు వెల్లడించిన సాయిరెడ్డి**

**విజయవాడ:**

ఏపీ మద్యం కేసులో సిట్ అధికారులు మరోసారి దూకుడు పెంచారు. ఈ కేసులో ఒక్కొక్కరి ప్రమేయంపై ఆరా తీస్తోంది సిట్. ఇందులో భాగంగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ అధికారులు మరోసారి నోటీసులు జారీ చేశారు. తాజాగా జారీ నోటీసుల్లో ఈ నెల 12న ఉదయం 10 గంటలకు విచారణకు హాజరుకావాలని పేర్కొన్నారు. లిక్కర్ స్కాం కేసులో సాక్ష్యం చెప్పాలని తెలిపారు. ఏప్రిల్ 18న తొలిసారి విచారణకు హాజరైన సమయంలో లిక్కర్ కేసులో కేసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాత్రతో పాటు మిగిలిన నిందితుల వివరాలను కూడా సిట్ అధికారులకు విజయసాయిరెడ్డి వివరించారు. అయితే అనూహ్యంగా మరోసారి విజయసాయిరెడ్డికి నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే విజయసాయిని ఓ సారి విచారించారు. మరోసారి కూడా విచారణకు రావాలని పిలవడంపై ఉత్కంఠరేపుతోంది.

# వైసీపీకి నాదెండ్ల సవాల్.. చర్చకు రావాలంటూ ఛాలెంజ్

- **గతంలో మనిషిని తొక్కించారు-**
- **ఇప్పుడు మామిడికాయలు తొక్కించారు-**
- **ప్రశ్నించే మనస్తత్వం మీకుంటే చర్చకు రండి- మంత్రి నాదెండ్ల**

**తెనాలి:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఖరీఫ్ మరియు రబీ 202425 సీజన్లో 2,01,934 రైతుల వద్ద నుండి 4575.32 కోట్ల విలువగల 19,84,098 మెట్రిక్ టన్నుల ధాన్యమును కొనుగోలు చేసిందని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార & పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తెనాలి మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం మునుపెన్నడూ లేని విధముగా ధాన్యము కొనుగోలు చేసిందని 24గం నుంచి 48గంల లోపే నగదు రైతుల యొక్క ఖాతాలలో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ధాన్యం కొనుగోలు బకాయిల నిమిత్తం రూ.659.39 కోట్ల రూపాయలను 30,403 రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు.

దేశంలో మొదటిసారి 20242025 మొత్తము ఇప్పటివరకు 4575.32 కోట్ల రూపాయలను 2,01,934 రైతుల ఖాతాల్లో 100 శాతం సొమ్మును జమ చేయటం జరిగిందన్నారు. గడిచిన రబీ కాలంలో 202122 ఏడాదికి గాను 2,29,248 రైతుల నుంచి 26,23,535 కోట్ల రూపాయల విలువ గల 5,099.62 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. ఒక పార్టీ అధినేత చిల్లర మనస్తత్వంతో గతంలో మనిషిని తొక్కించారు, మరోసారి చిత్తూరు జిల్లాలో మామిడికాయలు తొక్కించారని ఫైర్ అయ్యారు. ప్రశ్నించే మనస్తత్వం మీకుంటే చర్చకు రండి అంటూ మంత్రి నాదెండ్ల మనోహర్ సవాల్ విసిరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆర్థిక పరిస్థితులను అధిగమించి రైతులకు మేలు చేసేందుకు, వారికి కష్టం రాకుండా చూసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. జగన్ చిత్తూరు జిల్లా పర్యటనలో ఐదు ట్రాక్టర్లతో రెడీ చేసుకున్న పంటను దొంగ చాటుగా తీసుకువచ్చి రోడ్డుపై మామిడి కాయలు పోసి కేవలం ఫోటోలు కోసం వీడియోలు కోసం రైతు పండించిన పంటను ట్రాక్టర్లతో తొక్కేయడం దుర్మార్గం అన్నారు. రాజకీయాల్లో ప్రశ్నించే మనస్తత్వం ఉంటే, రైతు పక్షాన నిజాయితీగా ప్రశ్నించే తత్వం ఉంటే చర్చకు రవాలంటూ ఛాలెంజ్ చేశారు ని నాదెండ్ల మనోహర్. వ్యక్తిగత విమర్శలు, పోలీస్ పై దాడులు... వ్యవస్థలో ఉన్న వ్యక్తులను బెదిరించడం... ఎస్పీ స్థాయి, డిఎస్పి స్థాయి అధికారులను బెదిరించడం... కాలు నరుకుతాం, చేతులు నరుకుతాం అంటూ.. ప్రజలకు ఇచ్చే మెసేజ్ ఇదేనా అని ప్రశ్నించారు. రైతులను కలవాలి ... వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి.. శాసనసభలో చర్చించాలి... ఇది ఒక రాజకీయ పార్టీ అధినేతగా మీరు చేయవలసిన పని అంటూ సలహా ఇచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విగాతం కలిగించేలా ఎవరు ఏ ప్రయత్నాలు చేసినా కఠినంగా వ్యవహరించడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రజలను, రైతులను, మహిళలను రక్షించే విధంగా ప్రభుత్వం బాధ్యతలు తీసుకుంటుందని తెలిపారు.

# మిథున్ రెడ్డి బెయిల్‌పై ఆర్డర్స్ రిజర్వ్




- **లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం**
- **ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ**

**అమరావతి:**

ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఇరు వర్గాల వాదనలు విన్న కోర్టు మిథున్ రెడ్డి బెయిల్‌పై ఆర్డర్స్ రిజర్వ్ చేసింది. వైసీపీ ప్రభుత్వం హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని సిట్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో ఇప్పటికే వైసీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డితో పాటు పలువురు కీలక నేతలు అరెస్ట్ అయి రిమాండ్ ఖైదీలుగా జైల్లో ఉన్నారు. అయితే ఇదే కేసులో మిథున్ రెడ్డిపైనా ఆరోపణలు ఉన్నాయి. తనను అరెస్ట్ చేస్తారనే ప్రచారం ఈ నేపథ్యంలో ఆయన ముందస్తు బెయిల్ కోరుతున్నారు. ఈ మేరకు హైకోర్టును ఆశ్రయించారు.మరోవైపు ఏపీ మద్యం కేసులో నిందితులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ నాయుడుల బెయిల్ పిటిషన్లపై విజయవాడలోని ఏసీబీ కోర్టు గురువారం విచారణ జరిపింది. చెవిరెడ్డి పిటిషన్‌పై తదుపరి విచారణను 15కి, వెంకటేశ్ నాయుడు పిటిషన్ విచారణను 16కి వాయిదా వేసింది. ఈ కేసులో చెవిరెడ్డి ఏ 38, వెంకటేశ్ ఏ 34 నిందితులుగా ఉన్నారు. వీరిద్దరూ ప్రస్తుతం విజయవాడ జిల్లా జైల్లో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. గత ఎన్నికల సమయంలో మద్యం ముడుపుల నగదు ఓటర్లకు పంచారని సిట్ అభియోగాలు నమోదు చేసింది.



# కొవ్వూరు కూటమిలో కుంపటి

- **కొవ్వూరులో జనసేన శ్రేణుల ఆందోళన**
- **పొత్తు ధర్మం పాటించడం లేదంటూ నిరసన**

**కొవ్వూరు:**

కొవ్వూరు నియోజకవర్గం కూటమి పార్టీలో కంపటి రేగింది. జనసేన పార్టీకి అన్యాయం జరుగుతోందంటూ కొవ్వూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ T.V రామారావు ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు పార్టీ శ్రేణులు. రోడ్ కం రైల్వే బ్రిడ్జి దగ్గర నిరసన వ్యక్తం చేశారు కొవ్వూరు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు. నియోజకవర్గంలో 14 సొసైటీలకు గాను. 13 టిడిపికి . 1 జనసేనకు కేటాయించారు ఇది పొత్తు ధర్మమా అని కొవ్వూరు జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి T.v రామారావు ప్రశ్నించారు. రాబోవు రోజులో లోకల్ బాడీ ఎలక్షన్ లో ఇదే పొత్తు ధర్మం పాటిస్తే జనసేన పరిస్తితి ఏమిటి? అని ప్రశ్నించారు. కొవ్వూరు నియోజకవర్గమలో జనసేన మనుగడ ఉండకూడదనే కుట్రలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇప్పటికైనా పొత్తు ధర్మం పాటించాలని .. ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో టీడీపీ నడుచుకోవాలంటూ హెచ్చరించారు.

# పొగాకు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- **రోజుకు 500 బేళ్లు కొనుగోలు చేయాలి**
- **రిజక్షన్ పేరుతో రైతుల పంటను వెనక్కి పంపొద్దు**
- **కొరిశపాడులో పొగాకు కొనుగోలు కేంద్రం- మంత్రి గొట్టిపాటి**

**అద్దంకి:**



పొగాకు రైతుల నుంచి రోజుకు 500 బేళ్ల పొగాకు కొనుగోలు చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కంపెనీ ప్రతినిధులకు, ఏజెన్సీ నిర్వహకులకు, ఐటీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని జే.పంగులూరు పొగాకు కొనుగోలు కేంద్రాన్ని గురువారం నాడు మంత్రి గొట్టిపాటి పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోళ్లు జరుగుతున్న తీరును రైతుల నుంచి అడిగి తెలుసుకున్నారు. రిజక్షన్, క్వాలిటీ పేరుతో పొగాకును వెనక్కి పంపడంతో పాటు మందకొడిగా సాగుతున్న కొనుగోళ్ల వ్యవహారంపై పలువురు రైతులు మంత్రి గొట్టిపాటికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన మంత్రి పండిన చివరి పొగాకు ఆకును కూడా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పొగాకు రైతులు నష్ట పోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మామిడి, కోకో, పొగాకు పంటల విషయంలో ప్రభుత్వం రైతులకు మద్ధతుగా అనేక చర్యలు చేపట్టినట్లు వివరించారు. పొగాకు పంట కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.270 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. దేశ చరిత్రలో పొగాకు పంటను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయడం చారిత్రాత్మక విషయమని.., అది ఆంధ్రప్రదేశ్ లోనే సాధ్యమని ఆయన తెలిపారు. పొగాకు రైతుల అభ్యర్ధన మేరకు... కొరిశపాడులో త్వరలోనే పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**రైతుల కష్టంతో డ్రామాలు....**

రైతులు కష్టపడి పండించిన మామిడి పంటను రోడ్లపై పారబోసి వాహనాలతో తొక్కించిన జగన్మోహన్ రెడ్డి డ్రామాలాడుతున్నారని మంత్రి గొట్టిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి నష్టం లేకుండా అదనపు ధరతో మామిడి పంటను కొనుగోలు చేస్తున్నా... వైసీపీ అసత్య ఆరోపణలతో బురద జల్లే కార్యక్రమం చేపట్టిందని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా పాలన సాగుతుందన్నారు. రాష్ట్రానికి వెన్నుముక అయిన అన్నదాతకు ఎటువంటి కష్టం, నష్టం లేకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలతో పాటు పలువురు అధికారులు, ఐటీసీ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా ఇంద్రకీలాద్రి
# గిరి ప్రదక్షిణ

- శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ
- భారీగా పాల్గొన్న భక్తులు

**విజయవాడ:**

ఆషాఢ పౌర్ణమి సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రి దగ్గర గిరి ప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఘాట్ రోడ్డు మొదట ఉన్న శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ మొదలుపెట్టారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శీనునాయక్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరి కాయ కొట్టారు. అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభించారు. గిరిప్రదక్షిణలో తప్పెట్లు, కోలాటం, నృత్య ప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం, కళా బృందాల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఘాట్ రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి నుంచి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది. వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం వ్యక్తం చేశారు.

# స్వేచ్ఛగా చదువుకొని.. పిల్లలు దృఢంగా ఎదగాలి: ఎమ్మెల్యే



- రుద్రపాక జూనియర్ కళాశాలలో మెగా పీటీఎంలో పాల్గొన్న ఎమ్మెల్యే
- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఎమ్మెల్యే రాము
- పిల్లల భవిష్యత్తులో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం గొప్ప కార్యక్రమం

**నందివాడ:**

ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న మంత్రి లోకేష్ కు గుడివాడ ఎమ్మెల్యే వేనిగండ్ల రాము ధన్యవాదాలు తెలిపారు. విద్యాసంస్థల గేట్ల వరకే పరిమితమైన తల్లిదండ్రులను పిల్లల భవిష్యత్తులో భాగస్వామ్యం చేయడం గొప్ప కార్యక్రమం అన్నారు. గుడివాడ నియోజకవర్గం లోని నందివాడ మండలం రుద్రపాక జూనియర్ కళాశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఎమ్మెల్యే రాము ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యాసంస్థలు మనకు దూరంగా వెళ్లిపోయాయనీ, విద్యా సంస్థల గేట్ల వరకే తల్లిదండ్రులు పరిమితం అయ్యారని ఆయన అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులకు భాగస్వామ్యం కల్పించడం గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి సమావేశాల ద్వారా పిల్లల చదువు గురించి తల్లిదండ్రులకు చెప్పడం ద్వారా... విద్యార్థికి మరింత స్వేచ్ఛగా చదువు చెప్పి విద్యాబుద్ధులు నేర్పేందుకు ఉపాధ్యాయులకు మరింత అవకాశం లభిస్తుందని ఎమ్మెల్యే రాము అన్నారు. తెలుగువారికి స్వతహాగా నైపుణ్యం ఉంటుందని, ప్రపంచవ్యాప్తంగా ఐటీ నిపుణుల్లో అత్యధిక శాతం తెలుగు వారే కావడం గర్వకారణం అన్నారు. అమెరికా లాంటి కొన్ని దేశాల్లో ఐటీ సంస్థల్లో తెలుగులో సమావేశాలు నిర్వహిస్తున్నారంటే తెలుగువారి సత్తా ఏంటో అర్థం అవుతుందని ఆయన అన్నారు. పిల్లలు స్వేచ్ఛగా చదువుకుంటూ, ఎలాంటి సమస్యలు వచ్చిన ఎదుర్కొనేలా దృఢంగా ఎదగాలని, లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా , ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందేలా మంత్రి లోకేష్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఎమ్మెల్యే రాము అన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే రాము స్వయంగా మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సరదాగా మాట్లాడుతూ వారితో కలిసి ఎమ్మెల్యే రాము మధ్యాహ్నం భోజనం చేశారు. మెగా పిటిఎం సమావేశంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గం టిడిపి అబ్జర్వర్ నుకాలమ్మ, సీనియర్ టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి, కళాశాల ప్రిన్సిపల్ పీబి సాల్మన్ రాజ్, ఎంఈఓ డేవిడ్ రాజ్, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజధానిలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులో వైద్యశిబిరం
- రెండు రోజుల పాటు నిర్వహణ.. తొలి రోజు 200 మందికి ఉచిత వైద్య సేవలు

**తుళ్లూరు :**



ప్రజారాజధాని అమరావతిలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి మరియు రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారి సౌజన్యంతో ఏపీ సీఆర్డీఏ ఆధ్వర్యంలో తుళ్లూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(CHC)లో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన & ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం జరిగింది. 200 మంది ఈ శిబిరానికి హాజరు కాగా బసవతారకం ఆసుపత్రి వైద్య సిబ్బంది ఉచితంగా వారికి పరీక్షలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్ గారు హాజరయ్యారు. త్వరలోనే అమరావతిలో అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటు కానున్న బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఇక్కడ సేవలందించనుందని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు యర్రబాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్(UHC) లో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. బసవతారకం ఆసుపత్రి సీఈఓ డా. కూరపాటి కృష్ణయ్య గారు కార్యక్రమానికి హాజరయ్యారు. అమరావతిలో సిఆర్డిఏ సౌజన్యంతో 2 రోజులపాటు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్, అవగాహన శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రజల్లో ఉన్న భయాన్ని పోగెట్టేందుకు రాజధాని అమరావతిలో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నామని అన్నారు. ముందుగా క్యాన్సర్‌ను గుర్తిస్తే తక్కువ ఖర్చుతోనే నయం చేయవచ్చన్నారు. క్యాన్సర్ వ్యాధి సోకితే జీవితం ముగిసిపోయినట్టు కాదన్నారు. పలు రకాల క్యాన్సర్లను ముందస్తుగా గుర్తిస్తే పూర్తిస్థాయిలో నయం చేయవచ్చన్నారు.

# చదువును మించిన ఆస్తి లేదు: యార్లగడ్డ

- గన్నవరంలో మెగా పీటీఎం 2.0

**గన్నవరం:**



సమాజంలో ఆస్తికన్నా విద్యే గొప్పదని చెప్పారు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు. గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు వారసత్వంగా ఎక్కువ మొత్తంలో ఆస్తిని చ్చేవారని ప్రస్తుత పరిస్థితుల్లో ఆస్తికన్నా విద్యే గొప్పదని తెలుసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం పిల్లలకు ఎంత ఆస్తి ఇచ్చామన్నది ముఖ్యం కాదని ఉన్నత చదువులు చదివించి వారిని జీవితంలో స్థిరపడేలా చేయటమే ముఖ్యమని పేర్కొన్నారు. డబ్బు ఆస్తులు శాశ్వతం కాదని విద్యే శాశ్వతమని ఆయన తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఆస్తిపాస్తులు అన్ని ఒకరోజులో కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కానీ ఉన్నత విద్యను అభ్యసించడం వలన అది జీవితాంతం తోడు గా ఉండటంతో పాటు జీవితంలో స్థిరపడేలా చేస్తుందన్నారు. గన్నవరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశానికి యార్లగడ్డ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చదువుకునే టైంలో విద్యార్థులు ఆటపాటలతో ఎంజాయ్ చేస్తే జీవితాంతం కష్టపడాల్సి ఉంటుందని, ఈ వయసులో బుద్ధిగా చదువుకుంటే మంచి ఉద్యోగాలు సాధించి జీవితాంతం సుఖంగా బతుకు వచ్చని స్టూడెంట్స్‌కు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుచూపుతో 20 ఏళ్ల క్రితమే ఐటీ రంగాన్ని విస్తరించడంతో నేడు ఎంతోమంది ఐటీ రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. విద్యారంగానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లికి వందనం పథకం అమలు చేయడంతో పాటు స్కూలు విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు ఉచితంగా అందించినట్లు చెప్పారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తు ఎరిగి విద్యార్థులు అందరూ చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలు చేరుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు ఆకాంక్షించారు. అనంతరం నిడమానూరు గ్రామంలోని నారాయణ జూనియర్ కళాశాలలో పేరెంట్ టీచర్ సమావేశానికి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల అధ్యక్షులు గూడపాటి తులసి మోహన్, మండల ప్రధాన కార్యదర్శి బొడ్డపాటి రవి, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ సభ్యులు పడమట రంగారావు, పార్టీ నాయకులు గుడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, మేడేపల్లి రమ, గూడపాటి దుర్గాప్రసాద్, కాసర్నేని రంగబాబు, మద్దినేని వెంకటేశ్వరరావు, జాస్తి విజయభాషణ కుమార్, రిటైర్డ్ లెక్చరర్ గన్నే వెంకట్రావు, విజయకుమార్,తెలుగు యువత నాయకులు పరుచూరి నరేష్, కంచర్ల సూర్య, జనసేన నాయకులు చిమట రవి వర్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను పరిష్కరిస్తాం :ఎమ్మెల్సీ ఆలపాటి



- తెనాలిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం
- పలు సమస్యలు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చిన మహిళలు
- పరిష్కరిస్తామంటూ ఆలపాటి హామీ

**తెనాలి:**

నియోజకవర్గంలోని ప్రతి పౌరుని సమస్యను తెలుసుకుని పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తున్న కార్యక్రమం సుపరిపాలనతొలి అడుగు అని అభిప్రాయపడ్డారు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం 8వ రోజు, తెనాలి పట్టణంలోని 12, 13 వార్డులలో నిర్వహించారు. వార్డులలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకొన్నారు. ప్రభుత్వంలో అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు, మహిళలకు అందించే ఉచిత గ్యాస్ సిలిండర్ డబ్బులు తమ ఖాతాలలో జమ కావడం లేదని ఆలపాటి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని, ఉద్యోగ, వ్యాపార, రైతు, మహిళా సమస్యలను అడిగి తెలుసుకుని అపరిష్కృత సమస్యలను అధికార యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆలపాటి తెలిపారు. మండలి సభ్యులు,మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తోపాటు టీడీపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అక్రమ మైనింగ్.. తవ్వుకున్నోడు తవ్వుకున్నంత

- క్రషర్ల క్వారీల పేరిట దర్జాగా సాగుతున్న వ్యాపారం
- కోట్లాది రూపాయిల ప్రకృతి సంపదను కొల్లగొడుతున్న క్రషర్ల యజమానులు

**నందిగామ:**

ఎన్టీఆర్ జిల్లాలో క్రషర్ల క్వారీల పేరిట దర్జాగా అక్రమ మైనింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అక్రమంగా కోట్లాది రూపాయిల ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు క్రషర్ల యజమానులు. బిల్లులు లేకుండా అధికారుల ముందు నుంచి వాహనాలు వెళ్తున్న పట్టించుకోకుండా అధికార యంత్రాంగంచోద్యం చూస్తోందంటూ ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అధిక లోడ్ తో లారీలను తరలిస్తా ఆపే అధికారం ఆర్టీవో అధికారులకు లేకుండా పోయింది. అప్పుడు ఇప్పుడు అధికార పార్టీ క్రషర్ల అక్రమ దందా జోరుగా సాగుతోంది. క్వారీలలో లీజు పేరు చెప్పి కొండలను తోడేస్తున్నారు. గతంలో ఇప్పుడు.. ప్రభుత్వ అధికారాన్ని అడ్డంగా పెట్టుకుని.. అడ్డుకున్న వారిపై దౌర్జన్యం సాగిస్తున్నారు క్రషర్ల యజమానులు. మోడ్రన్ క్రషర్ మరియు క్రషర్ల యూనియన్ ప్రెసిడెంట్ ఆగడాతో ముక్కున వేలేసుకుంటున్నారు అధికారులు. రెవెన్యూ, మైనింగ్ శాఖ ఏమి చేయలేరని రెచ్చిపోతున్నారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో కషర్లు అక్రమ రవాణా తవ్వుకున్నోడు.. తవ్వుకున్నంత అన్న తీరుగా మారింది. పలు వాగులు, వంకలు, కాలువలు పూడ్చి క్రషర్ల నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. క్రషర్ల నుంచి కంకర అక్రమ రవాణాను స్థానికులు.. ఎవరైనా అడ్డుకుంటే సదరు క్వారీల క్రషర్ల యజమానులు అధికారాన్ని వినియోగించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం యాత్రంగం అక్రమ మైనింగ్ పై దృష్టిపెట్టాలని కోరుతోంది.



# భౌతిక దాడులు కరెక్ట్ కాదు మాజీ ఎమ్మెల్యే

- నల్లపురెడ్డి ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన కలివేటి సంజీవయ్య
- దాడికి పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**సూళ్లూరుపేట:**

కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటిపై దాడిని ఖండించిన తీవ్రంగా ఖండించారు మాజీ ఎమ్మెల్యే, సుళ్లూరుపేట వైసీపీ నేత కిలివేటి సంజీవయ్య. రాజకీయాల్లో విమర్శలు - ప్రతివిమర్శలు సహజం.. అంతేకాని భౌతిక దాడులకు దిగడం అత్యంత బాధాకరమన్నారు. మీడియాతో మాట్లాడుతూ సుమారు 200 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నల్లపురెడ్డి ఇంటిపై దాడికి పాల్పడి, ఆస్తి ధ్వంసం చేసి, ఆయన తల్లిని భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. నల్లపురెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, న్యాయంగా రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో విభేదాలు ఉండొచ్చు గానీ ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు సమాజానికి సరైన సందేశం ఇవ్వవన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బామ్మర్ది బాలకృష్ణ చేసిన వ్యాఖ్యల్ని ఎవరూ ఖండించకపోగా, ప్రతిపక్ష నేతలపై మాత్రం కేసులు పెట్టడమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు. 2019లో జరిగిన సంఘటనలను తాజాగా కేసులుగా నమోదు చేసి వైసీపీ నాయకులపై వేధింపులకు పాల్పడుతున్నారని తీవ్రంగా తప్పుబట్టారు. మా నాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎల్లప్పుడూ న్యాయపథానికే ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు అల్లూరు అనిల్ రెడ్డి, సన్నారెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి,కృపాకర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, అల్లూరు రమేష్ రెడ్డి, చిన్ని సత్యనారాయణ తదితర వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గతానికి–భవిష్యత్తుకు మధ్య వారధి చలపతిరావు



- నిమ్మలకుంటలో పర్యటించిన మంత్రి సత్యకుమార్
- పద్మశ్రీ చలపతిరావును సన్మానించిన మంత్రి

**ధర్మవరం:**

నియోజకవర్గంలోని నిమ్మలకుంటలో పర్యటించారు మంత్రి సత్యకుమార్ యాదవ్. ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా నిమ్మలకుంటకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత దళవాయి చలపతిరావుతో ఆ స్వగృహంలో సమావేశమయ్యారు మంత్రి. నిమ్మలకుంట సంస్కృతిక ఐకాన్ పద్మశ్రీ చలపతిరావుని మర్యాదపూర్వకంగా కలిసి.. శాలువాతో సత్కరించారు మంత్రి సత్యకుమార్. తోలుబొమ్మల కళకు జీవం నింపిన చలపతిరావుకి మంత్రివర్యులు అభినందనలు తెలిపారు. జీవితంలో తోలుబొమ్మల కళను కాపాడేందుకు చేసిన సేవలను కొనియాడారు. దళవాయి చలపతిరావు ఒక కళాకారుడే కాదు - మన సంస్కృతికి వారసుడు, మన గతానికి-భవిష్యత్తుకు మధ్య వారధిగా చలపతిరావు నిలిచిపోతారంటూ ప్రశంసించారు. చలపతిరావు లాంటి వారు మన మట్టిలో పుట్టడం గర్వకారణం అన్నారు. ఇలాంటి అరుదైన సాంప్రదాయ కళలను, కళాకారులను మనం గౌరవించి, వారి శ్రమను గుర్తించి, మన వారసత్వాన్ని నిలుపుకోవాలని ఆకాంక్షించారు. తోలుబొమ్మల కళలో అజరామర కీర్తిని సంపాదించారు. చేతితో తయారుచేసే తోలుబొమ్మల తయారీ, ప్రదర్శనలు నిర్వహించడం, తదుపరి తరం కళాకారులకు శిక్షణ ఇవ్వడం తదితర రంగాలలో ఆయన చూపిన అంకితభావం అద్భుతమైంది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంద్ర, రూరల్ అధ్యక్షులు చంద్ర, గోనుగుంట్ల భూషణ, ఓబులేష్, నబి రసూల్, శ్యామ్ రావు, గిర్రాజు నగేష్, రాజా రెడ్డి, రాజు, లక్ష్మీనారాయణ, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు పునాది తరగతి గదే

- నెల్లూరులో పీటీఎం 2.0 లో పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ
- మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ద్వారా సమస్యలకు పరిష్కారం

**నెల్లూరు :**



దేశ భవిష్యత్తుకు తరగతి గదే పునాది అని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేటలో ఉన్న ఆర్ ఎస్ ఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 2.0 కార్యక్రమంలో మంత్రి నారాయణతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారికి విద్యార్థులు, తల్లిదండ్రులు స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ మీటింగ్ నిర్వహిస్తున్నారని చెప్పారు. పాఠశాల అభివృద్ధిలో టీచర్లు తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు దగ్గర అవుతారనీ, పాఠశాలల్లో ఎంత నాణ్యమైన విద్య అందుతుంది, ఎలాంటి వసతులు ఉన్నాయి అనేది అర్థమవుతుందన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారం అవుతాయని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లలతో రోజూ 15 నిమిషాలు మాట్లాడితే వారు ఏం నేర్చుకుంటున్నారో తెలుస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా మీరు పడుతున్న కష్టాలను పిల్లలకు తెలిజేయాలని, కష్టపడే తత్వాన్ని అలవాటు చేయాలన్నారు. బడిలో విద్యార్థుల బాధ్యత టీచర్లది. ఇంట్లో తల్లిదండ్రులదని, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే తీర్చిదిద్దబడుతుందని చెప్పారు. ఏడాది పాలనలో ప్రజలు ఎంతో ప్రశాంతంగా సంతోషంగా ఉన్నారని తెలిపారు, సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం విశేష ఆదరణ లభిస్తుందని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

మంత్రి నారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 45వేల94 ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ పేరెంట్స్ టీచర్స్ మీటింగ్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. భారతదేశంలోనే ఎక్కడ కూడా ఇంత పెద్ద ఎత్తున కార్యక్రమం జరగలేదన్నారు . విద్యార్థుల చదువు నడవడికలు పేరెంట్స్ తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి నారాయణ తెలిపారు.. పెద్ద పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉద్దేశంతో మంత్రి నారా లోకేష్ పేరెంట్స్ టీచర్ మీటింగ్ పెట్టారన్నారు.. నెల్లూరు ప్రజల తరపున మంత్రి లోకేష్ కి నారాయణ కృతజ్ఞతలు తెలిపారు. చదువుకు పేదరికం అడ్డు కాదని అందుకే నేనొక నిదర్శనం అని తెలిపారు.. పిల్లలకు చదువే తల్లిదండ్రులు ఇచ్చే ఆస్తి అని.. గత ప్రభుత్వం చేసిన అప్పులు తీరుస్తూ ,సంక్షేమాన్ని మా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి తల్లికి వందనం అందిస్తున్నామన్నారు, తాను చదివి తొలి ఉద్యోగం చేసిన వి ఆర్ సి పాఠశాలను గత ప్రభుత్వ మూసేసిందని మండిపడ్డారు. 15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధమైన విఆర్సిని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారని ఎన్సిసి సిబ్బంది మరియు తన కుమార్తె విఆర్సిని అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు, ఆర్ ఎస్ ఆర్ స్కూల్ను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దత్తత తీసుకున్నారని.. వి ఆర్ సి కంటే అద్భుతంగా ఆర్ ఎస్ ఆర్ పాఠశాలను తీర్చి దిద్దుతారని వారు తెలిపారు.. వచ్చే విద్యా సంవత్సరానికి ఈ స్కూల్ సిద్ధంగా ఉంటుందని, అదేవిధంగా డి ఎస్ ఆర్ కన్స్ట్రక్షన్స్ మూలాపేట స్కూల్ ను దత్తత తీసుకొని ఆధునీకరణ పనులు చేపడుతుందన్నారు.

అంతకుముందు నగరంలోని 16వ డివిజన్ జగదీష్ నగర్ లో 25 లక్షలతో ఎండ్ టు ఎండ్ రోడ్డును పరిశీలించారు, అనంతరం 15వ డివిజన్లో బాలాజీ నగర్ లో కాలువ పూడిక తీత పనులను స్వయంగా పరిశీలించారు.. అదేవిధంగా ఏడాది సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం సంబంధించిన కరపత్రాలను ఎంపీ వేమిరెడ్డి, మంత్రి నారాయణ ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నందన్ ,డీఈఓ బాలాజీ రావు ,డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ ,మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ ,మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు ,కార్పొరేటర్లు శ్రీకాంత్ రెడ్డి ,సుజాత ,బీసీ బాబు స్కూల్ మేనేజ్మెంట్ చైర్మన్ సురేష్ ,డివిజన్ క్లస్టర్లు శ్రీనివాసులు నాయుడు ,బాలాజీ, ప్రెసిడెంట్లు సాయిరాం , పెంచల్ చౌదరి ,ప్రవీణ్ శంకర్ ,టీడీపీ ముఖ్యనేతలు ,కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

# పుట్టపర్తిలో గిన్నిస్ రికార్డు

- గురు పౌర్ణమి వేడుకల్లో ఆధ్యాత్మిక మహోత్సవం –
- సాయి గాయత్రీ మంత్రంతో ప్రపంచానికి శాంతి సందేశం.
- సాయి భక్తుల ఐక్యతకు గిన్నిస్ వరల్డ్ రికార్డు ముద్ర.

**పుట్టపర్తి:-**



పవిత్ర గురు పౌర్ణమి సందర్భంగా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి బాబా ఆలయంలో ఆధ్యాత్మిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, కేంద్ర వ్యవసాయ మరియు గ్రామీణాభివృద్ధి శాఖామాత్యులు శివరాజ్ సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. వేదికపై భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సమాధి వద్ద మంత్రి పుష్పాంజలి ఘటించి పూజలు చేశారు. దేశ ప్రజలందరికీ శాంతి, సంపద, సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వాలని సత్యసాయి బాబాను ప్రార్థించారు. ఈ సందర్భంగా సాయి సన్నిధిలో సాయి గాయత్రీ మంత్ర జపంలో ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి 11 వేల మంది భక్తులు పాల్గొని రికార్డు సృష్టించారు. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లో గుర్తించబడింది. ఇది కేవలం రికార్డు కాదు - ఒక ఆధ్యాత్మిక విప్లవం అని మంత్రి సత్యకుమార్ తెలిపారు. జూన్ 15, 2025న 10 నిమిషాల పాటు ఆన్లైన్‌లో ఒకేసారి 1,857 మంది భక్తులతో పఠించిన సాయి గాయత్రీ మంత్రం రికార్డును ఈసారి అధిగమించి, ప్రపంచ స్థాయి రికార్డుగా నిలిచింది. ఈ రికార్డును గిన్నిస్ అధికార ప్రతినిధి శ్రీ స్వప్నిల్ దర్నికార్ అధికారికంగా సర్టిఫికేట్ ప్రదానం చేశారు. అలాగే ఇది కేవలం ప్రపంచ రికార్డు కాదు - ఇది సాయి మార్గంలో నడిచే భక్తుల ఆధ్యాత్మిక ఐక్యతకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సాయి మిషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలకు, మరియు ఆధ్యాత్మికత - సాంకేతికత కలయికకు నూతన దిక్సూచి ఏర్పడిందని మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ధర్మం, ప్రేమ, సేవ వంటి మౌలిక విలువలను నూరిపోసే ఈ తరహా కార్యక్రమాలకు నిత్యం ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

# విద్యతోనే బంగారు భవిష్యత్తు మంత్రి దుర్గేష్

- ఉండ్రాజవరంలో నిర్వహించిన పీటీఎం2.0లో పాల్గొన్న మంత్రి
- డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ

**నిడదవోలు:**



మెగా పిటిఎం 2.0ను కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామన్నారు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్. గురువారం నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలంలోని ఎంవీఎన్ జెపీహెచ్ స్కూల్ లో నిర్వహించిన మెగా పిటిఎం 2.0లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిడదవోలు నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ 2.0ను అద్భుత కార్యక్రమంగా మంత్రి దుర్గేష్ అభివర్ణించారు. గత ప్రభుత్వానికి భిన్నంగా మంత్రి నారాలోకేష్ విద్యావ్యవస్థలో సమూల మార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని గుర్తుచేశారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తు, నాణ్యమైన చదువుల కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. చిన్నారుల్లో విద్యతో పాటు ఇతర రంగాల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలన్న దృఢ సంకల్పంతో ఈ మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయ మీటింగ్ నిర్వహించడం గొప్ప పరిణామన్నారు. తద్వారా విద్యారంగంలో నూతన వికాసానికి కూటమి ప్రభుత్వం నాంది పలికిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్యమంగా తీసుకొని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమవుతుందని, విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా పట్టుదలతో కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు తరగతిగదుల్లోనే నిర్మాణమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి ఏ రంగంపై ఆసక్తి ఉందో తెలుసుకొని తద్వారా అవసరమైన ప్రోత్సాహం అందించాలంటే ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మధ్య సత్సంబంధాలు ఉండాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయల పాత్ర చాలా కీలకమని చెబుతూ విద్యార్థుల వికాసానికి దోహదపడే మార్గాలను మంత్రి దుర్గేష్ వివరించారు. కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్, ఇతర మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు తమ దైనందిన జీవితంలో తమ పిల్లల బాగోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సంతకం పెట్టే ముందు ఏ సబ్జెక్ట్ లో అయితే తమ పిల్లాడు బలహీనంగా ఉన్నాడో గుర్తించి ఆ సబ్జెక్ట్ టీచర్ తో ప్రత్యేకంగా మాట్లాడాలన్నారు. ఆ సబ్జెక్ట్ లో విద్యార్థిని బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలను ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించి, విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించి విద్యను మరింత ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో కూటమి ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15,000 ఆర్థికసాయం అందిస్తోందని మంత్రి దుర్గేష్ అన్నారు. గతంలో ఒక్కరికే మాత్రమే ఇచ్చేవారన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ గారి పేరు పెట్టి తద్వారా చిన్నారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించి ఆరోగ్యకరమైన జీవనానికి బాటలు వేస్తోందన్నారు. రాజకీయ పార్టీల రంగులు, బొమ్మలు లేకుండా స్కూళ్లు పునః ప్రారంభమైన తొలి రోజు నుంచే విద్యార్థులకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో కిట్లు పంపిణీ చేశామన్నారు. జూనియర్ కాలేజీ విద్యార్థులకు యూనిఫామ్లు, పుస్తకాలు కూటమి ప్రభుత్వం అందిస్తున్నారు. అలాంటి మహానుభావుడి పేరుతో యూనిఫామ్లు, పాఠ్యపుస్తకాలు తదితర కిట్ అందించి వారి గొప్పతనాన్ని, ఆలోచన విధానాలను సమాజానికి తెలుపుతున్నామన్నారు. సమాజానికి సేవ చేసిన వ్యక్తుల పేర్లనే విద్యావ్యవస్థలోని పథకాలకు పెడుతున్నామే తప్ప గతంలోలా ఫ్యాక్షన్ లీడర్ల పేర్లు పెట్టలేదన్నారు. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభ గల విద్యార్థులకు ఆర్థిక సాయం అందించామన్నారు. అంతేగాక ప్రైవేట్ స్కూల్స్ కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామన్నారు.

# కూటమి పాలనలో అప్పులు తప్పా .. అభివృద్ధి, సంక్షేమం లేదు




- గోడు చెప్పుకోడానికి జగన్ వద్దకు రైతులు తరలివస్తే రౌడీలు అంటారా..?
- చంద్రబాబు వచ్చాడంటే బోనస్ గా కరువు వస్తుంది

**కడప:**

కూటమి ప్రభుత్వ 14 నెలల పాలనలో అప్పులు తప్పా ఇచ్చిన హామీలు నెరవేర్చిన పాపాన పోలేదని కడప జిల్లా వైసీపీ అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు మరచి ప్రజల తలలు తాకట్టుపెట్టి అప్పులు చేస్తున్నారన్నారని మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఒక పంటకు కూడా గిట్టు బట్టు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి ఆదుకోలేదని, ఏ పంటను ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో దళారులు విచ్చలవిడిగా దోపిడీకి చేస్తున్నారని ఫైర్ అయ్యారు. వైసీపీ పాలనలో రూ. 7500 కోట్లు ఒక్క ధరల స్థిరీకరణ కోసం వైఎస్ జగన్ ఖర్చు చేశారని, టీడీపీ మేనిఫెస్టోలో 5000 కోట్ల స్థిరీకరణ నిధి అని చెప్పి రైతులను గాలికి వదిలేశారని విమర్శించారు. మొన్నమిర్చి.. నిన్న పొగాకు.. నేడు మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రతిపక్ష నేత రైతులను కలవడానికి వెళితే ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. జగన్ హెలిపాడ్ దగ్గర 30 మంది కన్నా ఎక్కువగా ఉండకూడదని, మార్కెట్ యార్డ్ దగ్గర 500 మంది మించి ఉండకూడదు అని ఆంక్షలు పెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వాళ్ళ గోడు చెప్పుకోడానికి రైతులు తరలి వస్తే వాళ్లనే రౌడీలు అంటారా..? ప్రజలు రైతులను ఎవరిని రాకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు కార్యకర్తలకు నోటీస్ ఇచ్చారని, పార్టీ నాయకులు కార్యకర్తలను పోలీసు లాఠీ లతో చితకభదారన్నారు. చంద్రబాబు ప్రభుత్వానికి ఖచ్చితంగా బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందని, మీరు ఎన్ని ఆంక్షలు పెట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద అభిమానం ప్రజా ధారణ ఆపలేరన్నారు.

## AI విప్లవానికి గ్రాఫిటీ సహకారం..

# భారత్‌కు పిలుపు..!

**టీపీఎన్ ప్రతినిధి** : అమెరికాలో ఒక లెక్చర్ సందర్శన సందర్భంగా, హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో నా స్నేహితుడు మరియు సహోద్యోగి సియమియన్ ఫజ్‌ట్‌లోవిచ్‌తో ఒకరితో ఒకరు ఆసక్తికరమైన ట్యుటోరియల్ జరిగింది. సియమియన్ నన్ను తాను అభివృద్ధి చేసిన గ్రాఫిటీ అనే అద్భుతమైన సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేశాడు. ఈ ప్రోగ్రామ్ గ్రాఫ్ సిద్ధాంతంలో—నోడ్స్ మరియు ఎడ్జెస్ యొక్క నెట్‌వర్క్‌లను అధ్యయనం చేసే గణిత శాఖలో—కొత్త మరియు సాధారణం కాని ఊహాగానాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. నాకు, గ్రాఫిటీ 1980లు మరియు 1990లలో గణితం మరియు కంప్యూటర్ సైన్స్ రంగాలలో కృత్రిమ మేధస్సు (AI) యొక్క తొలి రూపాలలో ఒకటిగా కనిపించింది.

**గ్రాఫిటీ యొక్క AI సామర్థ్యాలు**

గ్రాఫిటీ యొక్క స్వయంచాలక రీజనింగ్ మరియు సృజనాత్మక సమస్యా పరిష్కార సామర్థ్యాలు AI యొక్క పలు లక్షణాలను ప్రదర్శించాయి. 1992 నాటికి, సియమియన్ గ్రాఫిటీని రసాయన శాస్త్రానికి కూడా విస్తరించాడు, ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందింది. న్యూయార్క్ టైమ్స్ ఈ సాఫ్ట్‌వేర్ ప్రభావాన్ని హైలైట్ చేస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ గ్రాఫ్ సిద్ధాంతకారులు గ్రాఫిటీ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఊహాగానాల రుజువులను ప్రచురించడం ప్రారంభించారు. ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు పాల్ ఎర్డోస్ కూడా ఈ ఊహాగానాలపై పనిచేశాడు, ఈ సాఫ్ట్‌వేర్ యొక్క ప్రాముఖ్యతను రేఖాంకితం చేశాడు.

AI విప్లవానికి గ్రాఫిటీ యొక్క సహకారం

ఈ రోజు మనం చూస్తున్న AI విప్లవం, గ్రాఫిటీ వంటి తొలి వేదికలకు చాలా రుణపడి ఉంది, ఇవి డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్‌లు, మరియు మెషిన్ లెర్నింగ్‌లలో తర్వాతి అభివృద్ధులకు బీజాలు నాటాయి. భారతదేశం ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో వాగ్దానాన్ని చూపించినప్పటికీ, ప్రేరణ లేని పాఠ్యప్రణాళికలు మరియు బౌద్ధిక ధైర్యం లేకపోవడం వల్ల AI విస్ఫోరణంలో పెద్దగా వెనుకబడిపోయింది. దశాబ్దాలుగా ఈ నిర్లక్ష్యం భారతదేశానికి భారీ ధరను చెల్లించవచ్చు.

**AI యొక్క ప్రస్తుత పురోగతి**

ప్రస్తుత AI విస్ఫోరణం ఒకవైపు ఉత్తేజకరంగా, మరోవైపు భయానకంగా ఉంది. మే మధ్యలో, యూకే మరియు యూఎస్ నుండి నిపుణులతో సహా సుమారు 30 ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు కాలిఫోర్నియాలోని బర్కిలీలో రహస్యంగా సమావేశమై, అత్యాధునిక రీజనింగ్ చాట్‌బాట్‌ను పరీక్షించారు. వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి కెన్ ఒనో నాయకత్వంలో, ఈ గణిత శాస్త్రజ్ఞులు రెండు రోజుల పాటు AIకి ప్రొఫెసర్‌స్థాయి సవాలు సమస్యలను ఉంచారు. ఆశ్చర్యకరంగా, చాట్‌బాట్ ప్రతి సమస్యను పరిష్కరించింది, ఒక కష్టమైన PhDస్థాయి ప్రశ్నను కేవలం పది నిమిషాల్లో పరిష్కరించింది—ఇది అత్యంత ప్రతిభావంతమైన మానవ మేధావులను కూడా ఆకట్టుకునే సామర్థ్యం.

**AI యొక్క సవాళ్లు**

OpenAI యొక్క o4మినీ మోడల్‌పై ఆధారపడిన ఈ AI, అనేక మానవ నిపుణులను అధిగమించే అధునాతన రీజనింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే, ఒక ప్రమాదం ఉంది: దాని ఆత్మవిశ్వాసం మరియు అధికారిక స్పందనలు కొందరిని భయపెట్టవచ్చు, దాని పరిష్కారాలను పరిశీలన లేకుండా అంగీకరించేలా చేయవచ్చు. ఒనో హాస్యంగా చెప్పినట్లు, చాట్‌బాట్ “భయపెట్టడం ద్వారా రుజువు” చేయడంలో నైపుణ్యం సాధించింది.

భారత్‌కు ఒక పిలుపు

గణిత శాస్త్రజ్ఞులకు మరియు సమాజానికి, ఈ క్షణం ఉత్తేజకరమైనది మరియు అస్థిరమైనది. ఒకప్పుడు అభివృద్ధి చేయడానికి మరియు సాధన చేయడానికి దశాబ్దాలు పట్టిన సాధనాలు ఇప్పుడు క్షణాల్లో సంక్లిష్ట సమస్యలను పరిష్కరిస్తున్నాయి. తన గొప్ప బౌద్ధిక సంప్రదాయంతో, భారతదేశం ఈ సవాలును స్వీకరించాలి మరియు AIని కేవలం సాధనంగా కాక, ఆవిష్కరణలో భాగస్వామిగా స్వీకరించాలి, లేకపోతే ఈ రూపాంతర యుగంలో మరింత వెనుకబడిపోయే ప్రమాదం ఉంది.






# సవాళ్లకు దీటుగా యంగ్ టీమిండియా..!

**టీపీఎన్ ప్రతినిధి | బర్మింగ్‌హామ్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ సాధించిన ఉత్తేజకర విజయం తర్వాత ఒక చర్చ రగిలింది: కొత్త టీమ్ ఇండియా చివరకు తన శిఖరాన్ని చేరుకుంటోందా? ఈ యువ జట్టు చుట్టూ ఉన్న కథనం తీవ్రంగా మారింది—లీడ్స్‌లో ఓటమి తర్వాత తీవ్ర విమర్శలు, ఆపై బర్మింగ్‌హామ్‌లో చారిత్రక విజయం తర్వాత ఉత్సాహపూరిత ప్రశంసలు. అయితే, తీవ్ర భావోద్వేగాలలో కొట్టుకుపోకుండా, వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించే సమయం ఇది.

**లీడ్స్ ఓటమి మరియు ఎడ్జ్‌బాస్టన్ పునరాగమనం**

లీడ్స్ టెస్ట్ ఓటమి శుభమన్ గిల్ మరియు జట్టుపై అభిమానులు మరియు విమర్శకులలో నిరాశను కలిగించింది. అయితే, క్రికెట్ అనేది గెలుపోటములతో నిండిన క్రీడ. ముఖ్యంగా, రెండవ టెసట్‌లో భారత్ యొక్క ప్రతిస్పందన స్థిరత్వం, నేర్చుకోవడం, మరియు అనుసరణను చూపించింది. సాపేక్షంగా కొత్త కెప్టెన్ నాయకత్వంలోని ఈ యువ జట్టు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. రవీంద్ర జడేజా తప్ప, ప్రస్తుత లైనప్‌లోని ప్రతి ఆటగాడు 34 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగినవాడు, ఇది రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే జట్టును సూచిస్తుంది.ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం: ఒక సవాలు

ఉపఖండ జట్లకు ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం అత్యంత కష్టమైన సవాలు. భారత్ చివరిసారిగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచింది. ఎంఎస్ ధోని మరియు విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు కూడా అక్కడ సిరీస్ విజయాన్ని సాధించలేకపోయారు. ఈ సందర్భంలో, రెండవ టెస్ట్ విజయం మరింత ఆకట్టుకుంది—భారత్ అరుదైన అవే విజయాన్ని సాధించడమే కాక, ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో ఘోరంగా ఓడించింది, ఇది రన్స్ పరంగా వారి అతిపెద్ద అవే విజయం. రికార్డు సృష్టించిన బ్యాటింగ్ మరియు బౌలింగ్ ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా 1014 పరుగులు సాధించింది, ఇది ఒక టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 1000 రన్స్ మార్కును దాటిన మొదటి సందర్భం. శుభమన్ గిల్ చరిత్ర సృష్టించాడు, ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ మరియు సెంచరీ సాధించిన తొలి టెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. రిషభ్ పంత్ మరియు రవీంద్ర జడేజా కూడా కీలక సమయాల్లో ఫామ్‌లోకి వచ్చారు.

ఇంగ్లండ్ బౌలింగ్ దాడి, జోఫ్రా ఆర్చర్, ఒల్లీ స్టోన్, మరియు మార్క్ వుడ్ వంటి కీలక బౌలర్లు లేకపోవడంతో సతమతమైంది. భారత బౌలర్లు, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ, అద్భుతంగా రాణించారు. ఆకాశ్ దీప్ మరియు మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను ధ్వంసం చేశారు. ఆకాశ్ దీప్ రెండు ఇన్నింగ్స్‌లలో 10 వికెట్లు తీసి, ఇంగ్లండ్‌లో భారత బౌలర్‌కు ఉత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. ఫ్లాట్ పిచ్‌పై వారి క్రమశిక్షణతో కూడిన, అవిశ్రాంత బౌలింగ్ ఒక మాస్టర్‌క్లాస్‌గా నిలిచింది. రాబోయే సవాళ్లుఇంగ్లండ్ దెబ్బతిన్నప్పటికీ, వారు తిరిగి బలంగా వస్తారని భావిస్తున్నారు. మూడవ టెస్ట్‌కు ఆర్చర్ తిరిగి రావచ్చు మరియు ఇతర బౌలర్లు ఫిట్‌నెస్ సాధించవచ్చు, ఇది ఆతిథ్య జట్టుకు బలాన్ని ఇస్తుంది. ఫ్లాట్ పిచ్‌లు మరియు కీలక ఆటగాళ్ల అనుపస్థితి ఇంగ్లండ్ యొక్క లోతును పరీక్షించాయి. అయినప్పటికీ, మూడు టెస్ట్‌లు మిగిలి ఉండటంతో, సిరీస్ ఫలితం ఇంకా నిర్ణయం కాలేదు. భారత్‌కు ఆత్మవిశ్వాసం ఉవ్వెత్తున ఉంది, చారిత్రక విజయం మరియు పూర్తిగా ఫిట్‌గా ఉన్న బుమ్రా తిరిగి వస్తే సిరీస్‌ను మరింత అనుకూలంగా మార్చవచ్చు.

**యువ జట్టు యొక్క బలం**

ఈ యువ భారత జట్టు ధైర్యం, ప్రతిభ, మరియు ఓటముల నుండి నేర్చుకునే సామర్థ్యాన్ని చూపించింది. ఎడ్జ్‌బాస్టన్ విజయం కేవలం స్కోర్‌బోర్డ్‌పై విజయం మాత్రమే కాదు; ఇది ఒక మానసిక బ్రేక్‌త్రూ, ఇంగ్లండ్ యొక్క దీర్ఘకాల ఆధిపత్యాన్ని భేదించింది. ఈ ఫామ్‌ను కొనసాగించి సిరీస్ విజయాన్ని సాధించగలరా అనేది చూడాల్సి ఉంది. కానీ ఒక విషయం స్పష్టం—ఈ టీమ్ ఇండియా తన లయను కనుగొంటోంది, ప్రపంచంలోని ఉత్తమ జట్లను వారి సొంత మైదానంలో సవాలు చేయడానికి సిద్ధంగా ఉంది.

# మెగా PTM 2.0 సరికొత్త అధ్యాయానికి నాంది..!

ఈ రోజు ప్రపంచంలో, వ్యక్తులు తమ "జీవన ప్రయాణాన్ని రూపొందించుకోవాలి" అనే ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు, మరియు ఈ విజయానికి సూక్ష్మమైన ప్రణాళిక కీలకం. గత కొన్ని దశాబ్దాలుగా, "విద్యార్థి జీవితాన్ని రూపొందించడం" అనే భావన గణనీయమైన ఆదరణ పొందింది. అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యక్తిగతీకరించిన మార్గమే పిల్లల వ్యక్తిగత వృద్ధికి ఏకైక మార్గమని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాయి.

అయితే, వాస్తవం భిన్నంగా ఉంది. మధ్య మరియు తక్కువ ఆదాయ కుటుంబాల తల్లిదండ్రులు ఈ కథనానికి ఆకర్షితులై, దురదృష్టవశాత్తూ, ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసింది. అయినప్పటికీ, ఉచిత ఆరోగ్యం మరియు విద్య అనేవి మంచి పాలన యొక్క ప్రాథమిక నిబద్ధతలుగా మిగిలాయి.

బాహ్య దృక్కోణం నుండి చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో గణనీయమైన సంఖ్యలో యువత ప్రతిష్టాత్మక IITలు మరియు ఇతర జాతీయ సంస్థలలో స్థానం సంపాదించారు. అయినప్పటికీ, ఈ సంస్థలను చేరాలని కలలు కనే విద్యార్థులలో వాస్తవంగా లక్ష్యాన్ని సాధించే వారి శాతం 3% కంటే తక్కువగా ఉంది, ఎందుకంటే చాలా మంది కోచింగ్ సంస్థల్లో చేరుతారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని మరియు యువతకు నిరాశను తెచ్చిపెడుతుంది, ఫలితంగా వారు రాష్ట్రంలోని ప్రైవేట్ వృత్తిపరమైన సంస్థల వైపు మొగ్గు చూపుతారు. ఈ మార్గాన్ని ఎంచుకున్న వారు తరచుగా తక్కువ జీతం గల ఉద్యోగాలతో జీవనం సాగించడానికి అవిశ్రాంత పోరాటం చేయాల్సి వస్తుంది.

**మెగా PTM 2.0: ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడం**

ఈ రోజు జరుగుతున్న మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (PTM) ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడానికి మరియు ప్రజల విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి ఒక ఉద్దేశపూర్వక మరియు కీలకమైన చర్య. రెండు మెగా PTMలు మరియు రెండు త్రైమాసిక పేరెంట్‌టీచర్ సమావేశాల షెడ్యూల్, రాష్ట్ర భవిష్యత్ కార్యక్రమాలకు సంతోషకరమైన, విజయవంతమైన, మరియు సామర్థ్యవంతమైన మానవశక్తిని తీర్చిదిద్దేందుకు ఒక బాగా రూపొందిన వ్యూహాన్ని సూచిస్తుంది. ఇటువంటి చురుకైన చర్యలు లేకపోతే, మహారాష్ట్ర మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు ఎదుర్కొన్న సవాళ్లను ఆంధ్రప్రదేశ్ కూడా ఎదుర్కోవచ్చు, ఇక్కడ ఆర్థిక వృద్ధి మరియు సంపద దిగుమతి చేసుకున్న నైపుణ్య కార్మికులపై మరియు స్థానికుల నుండి తిరుగుబాట్లపై ఆధారపడుతున్నాయి.

**తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారం**

ఈ ప్రయత్నంలో, సమాచారం కలిగిన తల్లిదండ్రి ప్రధాన పాత్ర పోషిస్తారు, మరియు తల్లిదండ్రులుఉపాధ్యాయుల సంయుక్త ప్రయత్నం పిల్లల భవిష్యత్తును వారి సహజ బలాలను ఉపయోగించుకుని, బలహీనతలను సవరించే విధంగా రూపొందించడంలో కీలకం. ఈ సహకారం సాంప్రదాయ విద్యను అధిగమిస్తూ, వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణాన్ని ప్రోత్సహిస్తుంది, ఇది అభివృద్ధి చెందిన దేశానికి అవసరమైన మానవ వనరులను నిర్మించడానికి ఆధారం.

ప్రభుత్వ విద్యలో పునరుజ్జీవనం

మన ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క విఘాతకర శక్తి మరియు జనరేషన్ Z యొక్క సూక్ష్మ ప్రాధాన్యతలతో గుర్తించబడిన గ్లోబల్ యుగంలో ఎప్పుడో ఆలస్యమైన పునరుజ్జీవనాన్ని గుర్తించింది. ప్రతి విద్యార్థి యొక్క పురోగతిని సంపూర్ణంగా సమీక్షించడం ద్వారా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సహకరించి విద్యార్థి యొక్క అభ్యాస శైలి, బలాలు, మరియు బలహీనతలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సహకార దృష్టి విజయాన్ని నిర్ధారిస్తుంది మరియు సరైన కెరీర్ ఎంపికలను సమాచారం చేస్తుంది, ఇంటిలో మరియు పాఠశాలలో వ్యక్తిగతీకరించిన మద్దతును అందిస్తుంది. ఈ సమన్వయం విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది, ఉన్నత గ్రేడ్‌లను సాధిస్తుంది, మరియు జీవితకాల అభ్యాస ప్రేమను నాటుతుంది.

**హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్**

ఈ రోజు సమావేశం యొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి, రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన విద్యార్థి యొక్క హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్ సమీక్ష. ఇది కేవలం విద్యా సమీక్షతో పాటు, విద్యార్థి యొక్క అకడమిక్ కాని, పాఠ్యేతర, మానసిక, మరియు శారీరక ఆరోగ్యాలను సమగ్రంగా అందిస్తుంది, ఇది విద్యార్థిని నిర్వచించడానికి మరియు భవిష్యత్తును రూపొందించడానికి ఒక ముఖ్యమైన మైలురాయి.

మానసిక శ్రేయస్సు మరియు కెరీర్ ఎంపికలు

ఈ సంవత్సరం, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ యొక్క చురుకైన విద్యా నిర్వహణ బృందం కింద నియమించబడిన ఇన్‌హౌస్ శిక్షణ పొందిన మనస్తత్వవేత్తలు మరియు కెరీర్ నిపుణుల ద్వారా రాష్ట్రం మానసిక శ్రేయస్సు మరియు సమాచార కెరీర్ ఎంపికలను ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రోజుల్లో చిన్న, న్యూక్లియర్ కుటుంబాలలో, ఇంటి మరియు పాఠశాల మధ్య స్థిరమైన సందేశాలు మరియు వ్యూహాలు చాలా ముఖ్యం. ఇవి పిల్లలకు సానుభూతి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక విలువలు, మరియు సమర్థవంతమైన సంభాషణ వంటి కీలకమైన సామాజికమానసిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఈ సమన్వయ విధానం కుటుంబాలు మరియు పాఠశాలలకు సమాచార నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఇస్తుంది, పిల్లలు సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచడానికి, మరియు వైవిధ్యమైన సామాజిక సెట్టింగులలో వృద్ధి చెందడానికి సన్నద్ధం చేస్తుంది.

పేరెంట్‌టీచర్ సమావేశాల లక్ష్యాలు

పేరెంట్‌టీచర్ సమావేశాల యొక్క ప్రధాన ఫలితాలను స్థిరత్వం, వనరుల విస్తరణ, మరియు సానుకూల పాఠశాల సంస్కృతిగా నిర్వచించవచ్చు.

LEAP: విద్యా శ్రేష్ఠతను నడిపించే సాధనం

ఈ అన్ని ప్రయత్నాలు LEAP (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే బలమైన అప్లికేషన్ ద్వారా ఖచ్చితంగా పర్యవేక్షించబడుతున్నాయి, ఇది పాఠశాల నిర్వహణ మరియు ప్రణాళిక కోసం రూపొందించబడింది. అన్ని పురోగామి దేశాలు నాణ్యమైన డేటాపై ఆధారపడినట్లే, LEAP ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యా శ్రేష్ఠతను నడిపించి, బలమైన మరియు ఆర్థికంగా స్థిరమైన భవిష్యత్తును నిర్ధారిస్తుంది. గుర్తుంచుకోండి, విద్య అందరికీ, మరియు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ఈ హక్కులను నిర్ధారిస్తుంది.

**గమనిక: ఈ కథనం రచయిత యొక్క దృక్కోణం మాత్రమే.**



**రామ్ కమల్,**
**సోషల్ ఇంజినీర్, సమగ్ర విద్య సలహాదారు,ఏపీ**

## మాటల్లో చెప్పలేని హింస : శశిథరూర్



టీపీఎన్, న్యూఢిల్లీ : దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా మిగిలిన ఎమర్జెన్సీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ కుమారుడు సంజయ్ గాంధీ వ్యవహరించిన తీరు అత్యంత క్రూరంగా ఉందని, ఆయన చర్యలు మాటల్లో చెప్పలేని హింసకు దారితీశాయని తీవ్రంగా విమర్శించారు. ఎమర్జెన్సీని కేవలం ఒక మరపురాని ఘట్టంగా కాకుండా, ఓ గుణపాఠంగా చూడాలని ఆయన అభిప్రాయపడ్డారు.
దేశంలో అత్యవసర పరిస్థితి విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో థరూర్ ఈ విషయాలను ప్రస్తావించారు. 197577 మధ్యకాలంలో సంజయ్ గాంధీ గ్రామీణ ప్రాంతాల్లో బలవంతంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి హింసను మార్గంగా ఎంచుకున్నారు. అదుపులేని అధికారం నిరంకుశత్వానికి ఎలా దారితీస్తుందో ఆనాటి ఘటనలు నిరూపించాయి. ఆ చర్యలను తర్వాత 'దురదృష్టకరం' అని అభివర్ణించినా, ఆ గాయాలను ఎవరూ మర్చిపోలేరు అన్నారు.
ఎమర్జెన్సీ సమయంలో ఢిల్లీ లాంటి నగరాల్లో మురికివాడలను కనికరం లేకుండా కూల్చివేశారని, వేలాది మందిని నిరాశ్రయులను చేశారని గుర్తుచేశారు. పౌరుల ప్రాథమిక హక్కులను అణచివేసి, భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా హరించడం భారత రాజకీయాల్లో ఒక మాయని మచ్చగా మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చీకటి రోజుల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తులో ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.



## సీఎం కుర్చీ ఖాళీ కాలేదు

### నేనే 5 ఏళ్లు సీఎం:సిద్ధరామయ్య

**టీపీఎన్, బెంగళూరు :**
కర్నాటక రాజకీయాలు రోజుకో కొత్త మలుపు తిరుగుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ఇద్దరూ ప్రభుత్వంలోని అగ్రనేతలు ఢిల్లీలో మకాం వేశారు. డిప్యూటీ సీఎం శివకుమార్ కర్ణాటక భవన్‌లో కొత్తగా నిర్మించిన సీఎం సూట్‌లో బస చేయగా, సిద్ధరామయ్య పాత సూట్‌లో బస చేస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని విడివిడిగా కలవడానికి ఇద్దరు నాయకులు సమయం కోరారు. ఈ నేపథ్యంలో, కర్ణాటకలో నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలు జోరందుకున్నాయి.ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తాను ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉంటానని సిద్ధరామయ్య స్పష్టంగా చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తానని తెలిపారు. ఓబీసీ కౌన్సిల్‌లో తనకు స్థానం కల్పించడం ద్వారా ఢిల్లీ నుంచి పిలుపువచ్చిందనే ఊహాగానాలను కూడా ఆయన తోసిపుచ్చారు. నేను ఎక్కడికీ వెళ్లను, కర్ణాటకలోనే ఉంటాను, ఈ కుర్చీలోనే ఉంటానని అన్నారు. ప్రస్తుతం సీఎం కుర్చీ ఖాళీగా లేదని స్పష్టం చేశారు. డీకే శివకుమార్‌కు మద్దతు ఇచ్చే కొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఆయన అంగీకరించారు. అటు ప్రతిపక్ష బీజేపీ కాంగ్రెస్‌పై అవినీతి ఆరోపణలు చేస్తోంది. రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి మార్పు ఉంటుందనే అంశంపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, తమకు ఎటువంటి సూచనలు ఇవ్వలేదని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా ఆయన స్పందించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పటిష్టంగానే ఉందని, నిధుల కొరత లేదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను, ముఖ్యంగా ఈడీని కాంగ్రెస్ నాయకులను లక్ష్యంగా చేసుకుని దుర్వినియోగం చేస్తోందని ఆయన ఆరోపించారు

# బీజేపీ జాతీయ అధ్యక్షుడి ఎంపికపై కసరత్తు

## ఈసారి రేసులో ముగ్గురు మహిళలు

**టీపీఎన్, న్యూఢిల్లీ :**
బీజేపీ చారిత్రాత్మక మార్పు వైపు పయనిస్తుందని ఉన్నత స్థాయి వర్గాలు సూచించాయి. కాషాయ పార్టీ మొదటిసారిగా మహిళా జాతీయ అధ్యక్షురాలిని నియమించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలంగా పార్టీ అగ్ర నాయకత్వంలో చర్చలు జరుగుతున్నాయి, ఇందులో అనేక మంది ప్రముఖ మహిళా నాయకుల పేర్లు పరిశీలిస్తున్నారు. బిజెపి తదుపరి జాతీయ అధ్యక్షురాలు ఎవరు? దీనిపై ప్రస్తుతానికి సస్పెన్స్ కొనసాగుతోంది. కొంతకాలంగా పార్టీ అగ్ర నాయకత్వంలో చర్చలు జరుగుతున్నాయి. ఇందులో చాలా మంది ప్రముఖ మహిళా నాయకుల పేర్లు పరిగణించబడుతున్నాయి. సంస్థాగత సమతుల్యత, మహిళా సాధికారత , రాబోయే ఎన్నికల వ్యూహాల పరంగా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.ఈ రేసులో దేశ ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నారని భావిస్తున్నారు. నిర్మలా సీతారామన్ ఇటీవల పార్టీ ప్రధాన కార్యాలయంలో బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా , ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌లను కలిశారు. ఆమె నియామకం, పార్టీకి అనేక వ్యూహాత్మక లక్ష్యాలను సాధించడంలో సహాయపడుతుందని అంతర్గత వర్గాలు భావిస్తున్నాయి. ఈ పదవికి నిర్మలా సీతారామన్ ఎంపికైతే, ఆమె పదోన్నతి దక్షిణ భారతదేశంలో బిజెపి తన పట్టును బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. దీంతో పాటు మహిళలకు సాధికారత కల్పించాలనే మోడీ ప్రభుత్వ సంకల్పం కూడా ఫలిస్తుంది. ప్రస్తుతం ఆర్థిక మంత్రిగా పనిచేస్తున్న నిర్మలా సీతారామన్ గతంలో రక్షణ శాఖను నిర్వహించారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో



సుదీర్ఘ అనుభవాన్ని కలిగి ఉన్నారు.

**పురందేశ్వరి**
ఇక దగ్గుబాటి పురందేశ్వరి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన స్థానాన్ని కలిగి ఉన్నారు. పురందేశ్వరి ఏపీ నుంచి ఎంపీగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో బిజెపి అధ్యక్షురాలిగా కూడా పనిచేశారు. సుష్మా స్వరాజ్ లాగా పురందేశ్వరిని ఆకట్టుకునే వక్తగా భావిస్తారు. ఆమె రెండు ప్రధాన జాతీయ పార్టీలలో విజయవంతమైన కెరీర్‌ను కలిగి ఉంది. ఆమె బహుభాషావేత్త .తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషలలో బాగా ప్రావీణ్యం కలవారు.ఆమె 2023 జులైలో ఆంధ్రప్రదేశ్‌లో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఇటీవలి వరకు ఈ పదవిలో ఉన్నారు. ఆమె దక్షిణ భారతదేశంలో పార్టీకి పెద్ద ప్రతినిధిగా మారగలదు.

**వానతి శ్రీనివాసన్**
వానతి శ్రీనివాసన్ న్యాయవాది. రాజకీయాల్లో చురుకుగా పనిచేస్తారనే పేరుంది.. ప్రస్తుతం తమిళనాడు శాసనసభలో కోయంబత్తూర్ సౌత్ నుండి బిజెపి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆమె రాజకీయ ప్రయాణం 1993 లో భారతీయ జనతా పార్టీలో చేరడంతో ప్రారంభమైంది. అప్పటి నుండి ఆమె పార్టీ సంస్థలో క్రమంగా అంచెలంచెలుగా ఎదిగారు. వానతి తమిళనాడు బిజెపిలో రాష్ట్ర కార్యదర్శి (201314), ప్రధాన కార్యదర్శి (201420) రాష్ట్ర ఉపాధ్యక్షుడు (2020) వంటి ముఖ్యమైన పాత్రలను నిర్వహించారు.
2020 అక్టోబర్‌లో బిజెపి మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా వానతి నియమితులయ్యారు. పార్టీ మహిళల్లో తన స్థానాన్ని బలోపేతం చేయడంపై దృష్టి సారించిన సమయంలో ఆమె ఈ బాధ్యతను స్వీకరించారు. 2022లో, ఆమెను బిజెపి కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమించారు. ఈ ప్రతిష్టాత్మక కమిటీలో చేర్చబడిన మొదటి తమిళ మహిళ ఆమె. వానతి శ్రీనివాసన్ న్యాయ నిపుణురాలు మాత్రమే కాదు.. అట్టడుగు రాజకీయాలలో కూడా నిష్ణాతురాలు. మహిళా సాధికారత, సంస్థాగత బలం, శాసనసభలో చురుకైన పాత్ర ద్వారా ఆమె రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా తనదైన ముద్ర వేశారు.

**ఆర్ఎస్ఎస్ కూడా సిద్ధంగా ఉందా?**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) కూడా మహిళా నాయకత్వం పట్ల సానుకూల వైఖరిని అవలంబించింది. మహిళా నాయకత్వం ప్రతీకాత్మకంగా , వ్యూహాత్మకంగా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని వారు విశ్వసిస్తున్నారు. ఇటీవలి కాలంలో బిజెపికి మహిళా ఓటర్ల నుండి భారీ మద్దతు లభించింది. ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా , ఢిల్లీ వంటి రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో. పార్టీ మహిళా కేంద్రీకృత పథకాలు , లబ్ధిదారుల ఓటు బ్యాంకు వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తాయి.

# బీహార్ ఓటర్ల జాబితా సవరణకు సుప్రీం గ్రీన్ సిగ్నల్

**టీపీఎన్, పాట్నా :**
బీహార్‌లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) ప్రక్రియకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఓటర్ల జాబితా సవరణపై స్టే విధించేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. రాజ్యాంగం ప్రకారం ఈసీకి ఈ ప్రక్రియను నిర్వహించే అధికారం ఉందన్న సుప్రీంకోర్టు.. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ కొనసాగించవచ్చని ఈసీకి సూచించింది. ఇదే సమయంలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు నెలల ముందు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' నిర్వహించాలనే ఈసీ నిర్ణయంపై సుప్రీంకోర్టు తీవ్రమైన సందేహాలను వ్యక్తం చేసింది. బీహార్ ఓటర్ల జాబితా సవరణను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలు అయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సుధాన్షు ధులియా ధర్మాసనం విచారణ చేపట్టింది. బీహార్‌లో ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై స్టే విధించేందుకు ధర్మాసనం నిరాకరించింది.




అఫిడవిట్ దాఖలు చేయడానికి ఎన్నికల కమిషన్‌కు ఇంకా సమయం ఉందని పేర్కొన్న ధర్మాసనం.. కేసు తదుపరి విచారణను 2025 జులై 28కి వాయిదా వేసింది. విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ధర్మాసనం ఈసీకి కీలక ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డులను చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలుగా పరిగణించాలని ఈసీని ఆదేశించింది.స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ నిర్వహించడం సమస్య కాదు.. కానీ బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఈ వ్యాయామాన్ని నిర్వహించగలరా అని మాకు తీవ్రమైన సందేహాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. దాదాపు 8 కోట్ల మంది జనాభా ఈ ఇంటెన్సివ్ సమీక్షకు లోబడి ఉండటంతో దీనిని రాబోయే ఎన్నికలతో అనుసంధానించడం సాధ్యమేనా అని ఈసీని ప్రశ్నించింది ధర్మాసనం. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను నవంబర్‌లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ఎందుకు అనుసంధానించాలి..? ఎన్నికలతో సంబంధం లేకుండా ఎస్ఐఆర్ తర్వాత ఎందుకు చేయకూడదని ప్రశ్నించింది. అనంతరం పిటిషన్ పై విచారణను జూలై 28కి వాయిదా వేసింది ధర్మాసనం. అప్పటి వరకు ఓటర్ల సవరణ జాబితా ముసాయిదాను ప్రచురించవద్దని ఈసీని ఆదేశించింది.

# బీహార్‌లో మహిళలు నిజంగా సాధికారత పొందుతున్నారా?

**టీపీఎన్, పాట్నా :**
బీహార్‌లో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, రాష్ట్ర ప్రభుత్వం మహిళలపై దృష్టి పెట్టింది. మహిళల ఓటు ఇప్పుడు చాలా ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. కారణం గత కొన్ని సంవత్సరాలుగా మహిళలు ప్రభావవంతమైన ఓటు బ్యాంకుగా మారారు. ఈ విషయంలో, ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రకటించారు. నిజానికి గత దశాబ్ద కాలంగా బీహార్‌లో మహిళా ఓటర్ల సంఖ్య పురుషుల కంటే ఎక్కువ. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళల ఓటింగ్ శాతం 59.7 కాగా, పురుషుల ఓటింగ్ శాతం 54.6 మాత్రమే. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్న మూడవ ఎన్నిక ఇది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు 59.9 శాతం మహిళా ఓటర్లు పాల్గొనగా, పురుషుల శాతం 55.3. ఇటీవల 2024 లోక్‌సభ ఎన్నికల్లో కూడా మహిళలు పురుషుల కంటే ఎక్కువగా ఓటు వేశారు. మహిళల ఓటింగ్ శాతం 59.45 కాగా, పురుషుల ఓటింగ్ శాతం 53.

**బీహార్‌లో బాలికల సంఖ్య పెరుగుదల**
జనాభా స్థాయిలో, బీహార్ క్రమంగా మెరుగుపడింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా NITI ఆయోగ్ మార్చి 2025 నివేదిక ప్రకారం రాష్ట్రంలో జనన సమయంలో లింగ నిష్పత్తి 1,000 మంది పురుషులకు 933 మంది మహిళలు. ఇది జాతీయ సగటు 914 కంటే ఎక్కువ.

**పనిలో మహిళల భాగస్వామ్యం**
మహిళలకు రిజర్వేషన్ ఇవ్వడం మంచి విషయమే, కానీ అసలు ప్రశ్న బీహార్‌లో ఎంత మంది మహిళలు పనిచేస్తున్నారు? పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, 2017-18లో 15 ఏళ్లు పైబడిన మహిళల శ్రమ భాగస్వామ్య రేటు కేవలం 4.1 శాతం మాత్రమే ఉంది. ఇది దేశంలోనే అత్యల్పం. కానీ ఈ రేటు 2022-23లో 22.4 శాతానికి పెరిగింది. 2023-24లో ఇది 30.5 శాతానికి చేరుకుంది. అంటే ఆరు సంవత్సరాలలో ఏడు రెట్లు పెరుగుదల.
2017-18లో, బీహార్‌లో మహిళా కార్మికుల పంపిణీ దాదాపు మూడు భాగాలుగా ఉంది. స్వయం ఉపాధి, జీతాలు,సాధారణ శ్రమ. కానీ 2023-24లో పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు 83 శాతం మంది మహిళలు స్వయం ఉపాధిలో నిమగ్నమై ఉన్నారు. 4.8 శాతం మంది మహిళలు మాత్రమే సాధారణ జీతాలు పొందే ఉద్యోగాలలో ఉన్నారు. 11.7 శాతం మంది మహిళలు రోజువారీ వేతన కార్మికులుగా పనిచేస్తున్నారు.

**మహిళలు తక్కువ సంపాదన**
శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పటికీ, వారి ఆదాయం ఇప్పటికీ పురుషుల కంటే చాలా తక్కువగా ఉంది. బీహార్ ఆర్థిక సర్వే 2023-24 ప్రకారం,గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి పొందుతున్న మహిళలు నెలకు సగటున రూ.4,434 సంపాదిస్తారు. పురుషులు రూ.10,000 కంటే ఎక్కువ సంపాదిస్తారు. పట్టణ స్వయం ఉపాధిలో ఈ అంతరం ఇంకా ఎక్కువగా ఉంది. మహిళలు రూ.8,342 సంపాదిస్తారు, పురుషులు రూ.18,583 సంపాదిస్తారు. ఈ వ్యత్యాసం రూ.10,000 కంటే ఎక్కువ. పట్టణ ప్రాంతాల్లో సాధారణ జీతం పొందే




ఉద్యోగాలలో మహిళలు నెలకు రూ.22,394 సంపాదిస్తారు, పురుషుల సగటు ఆదాయం రూ. 23,869. ఈ వ్యత్యాసం సాపేక్షంగా తక్కువగా ఉన్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో జీతం పొందే ఉద్యోగాలలో, ఈ వ్యత్యాసం మళ్లీ పెరుగుతుంది. పురుషులు రూ.18,504 సంపాదిస్తున్నారు. మహిళలు రూ.14,848 సంపాదిస్తారు. అంటే ప్రతి నెలా రూ.3,656 తేడా ఉంది.



# నిమిషా ప్రియకు ఉరిశిక్ష ఆగేనా?

- **ఈ నెల 16న నిమిష ప్రియకు ఉరిశిక్ష**
- **ఆమెను కాపాడాలంటూ భారత సుప్రీంకోర్టులో పిటిషన్**

**టీపీఎన్, యెమెన్ :**

అరబ్ దేశం యెమెన్‌లో మాజీ వ్యాపార భాగస్వామిని హత్య చేసిన కేసులో ఉరిశిక్ష పడిన భారతీయ నర్సు నిమిషా ప్రియను కాపాడేందుకు ప్రయత్నాలు ఉపందుకున్నాయి. ఆమెకు ఈ నెల 16న ఉరిశిక్ష అమలు చేయాలని యెమెన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఇప్పటికే జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నిమిష ప్రియ ఉరిశిక్ష అమలుకు సమయం దగ్గరపడుతున్న వేళ, ఈ కేసును విచారించేందుకు భారత సర్వోన్నత న్యాయస్థానం ముందుకొచ్చింది. నిమిష ప్రియను కాపాడేందుకు దౌత్యపరమైన చర్యలు చేపట్టేలా కేంద్రాన్ని ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. ఈ పిటిషన్‌పై ఈ నెల 14న విచారణ జరపనున్నట్లు సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది. విచారణను త్వరగా చేపట్టాలని సీనియర్ న్యాయవాది రాజేంత్ బసంత్ కోర్టును అభ్యర్థించారు. షరియా చట్టం ప్రకారం, మృతుడి కుటుంబానికి నష్టపరిహారం (బ్లడ్ మనీ) చెల్లించడం ద్వారా క్షమాభిక్ష పొందే అవకాశం ఉందని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్'పేరిట స్వచ్ఛంద, సామాజిక కార్యకర్తలు ఆమెను ఉరిశిక్ష నుంచి తప్పించడానికి ఉద్యమిస్తున్నారు. ప్రజల మద్దతు కూడగడుతున్నారు. హత్యకు గురైన మెహదీ కుటుంబం క్షమాభిక్ష ప్రసాదిస్తే శిక్ష నుంచి ఆమె బయటపడే అవకాశం ఉంది. బాధిత కుటుంబానికి బ్లడ్‌మనీ కింద చెల్లించడానికి నిమిషా ప్రియ బంధువులు, మిత్రులు, మద్దతుదారులు రూ.7,35,000 సేకరించారు. మెహదీ కుటుంబం స్పందన కోసం ఎదురు చూస్తున్నామని 'సేవ్ నిమిషా ప్రియ కౌన్సిల్'సభ్యుడు, సామాజిక కార్యకర్త బాబు జాన్ చెప్పారు. ఆమెను ఎలాగైనా రక్షించాలన్నదే ఆశ ఆశయమని అన్నారు. ఇప్పటికైనా క్షమాభిక్ష ప్రసాదించాలని, ఒక మహిళ ప్రాణాలు కాపాడాలని మెహదీ కుటుంబాన్ని కోరారు. నిమిషా ప్రియకు మద్దతు ప్రకటిస్తూ సోషల్ మీడియాలో చాలామంది పోస్టులు చేస్తున్నారు. ఉరిశిక్ష నుంచి బయటపడి ఆమె క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు.బ కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన నిమిష ప్రియ, నర్సుగా ఉద్యోగం కోసం 2008లో యెమెన్‌కు వెళ్లారు. అక్కడ సొంతంగా క్లినిక్ ప్రారంభించేందుకు యెమెన్ పౌరుడైన తలాల్ అదిబ్ మెహదీని వ్యాపార భాగస్వామిగా చేసుకున్నారు. అయితే, కొంతకాలానికే మెహదీ నుంచి ఆమెకు వేధింపులు మొదలయ్యాయి. ఈ క్రమంలో 2017లో, అతని నుంచి తన పాస్‌పోర్ట్‌ను తిరిగి పొందేందుకు నిమిష ప్రియ ప్రయత్నించారు. అందులో భాగంగా అతనికి మత్తుమందు ఇచ్చారు. అయితే, ఆ మందు మోతాదు ఎక్కువ కావడంతో మెహదీ మరణించాడు. ఈ హత్య కేసులో విచారణ జరిపిన యెమెన్ న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష విధించింది. తన కుమార్తెను కాపాడుకునేందుకు నిమిష తల్లి ప్రేమకుమారి గత ఏడాది యెమెన్‌కు వెళ్లి మృతుడి కుటుంబంతో చర్చలు జరిపినా అవి ఫలించలేదు. ఈ నేపథ్యంలో సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.



# తాలిబాన్ ప్రభుత్వానికి రష్యా మద్దతు

రష్యా ఒక చారిత్రాత్మక అడుగు వేసి ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకపోవడంతో ఈ చర్య ప్రపంచ రాజకీయాల్లో ఒక మలుపుగా పరిగణించబడుతుంది. తాలిబన్లు నియమించిన కొత్త ఆఫ్ఘన్ రాయబారి గుల్ హసన్ హసన్‌ను అంగీకరిస్తూ రష్యా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. దీంతో, తాలిబన్ పాలనను అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా రష్యా నిలిచింది. 2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ అధికారంలోకి వచ్చింది.ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి అధికారిక గుర్తింపు లభించడం వల్ల రెండు దేశాల మధ్య వివిధ రంగాలలో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని విశ్వసిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆండ్రీ రుడెంకో మాస్కోలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గుల్ హసన్ హసన్‌ను కలిశారు.

కాబూల్‌లోని తాలిబన్ అధికారులు రష్యా చర్యను స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి మాట్లాడుతూ ఇది రెండు దేశాల సంబంధాల చరిత్రలో ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు.

2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రష్యా కాబూల్‌లోని తన రాయబార కార్యాలయాన్ని తెరిచి ఉంచింది. తాలిబన్ నాయకత్వంతో సంబంధాలు కొనసాగిస్తుంది. వాణిజ్యం, ఆర్థిక రంగాలలో సహకారాన్ని పెంపొందుతుందని భావిస్తున్నారు. ఇంధనం, రవాణా, వ్యవసాయం , మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పనిచేయాలని యోచిస్తోందని రష్యా ప్రభుత్వం తెలిపింది. దీంతో పాటు విద్య, సంస్కృతి, క్రీడలు , మానవతా రంగాలలో సంబంధాలను బలోపేతం చేయాలనే కోరిక కూడా వ్యక్తమైంది.ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించలేదు. చాలా దేశాలు తాలిబన్లు అంతర్జాతీయ ప్రమాణాలకు, ముఖ్యంగా మానవ హక్కుల విషయాలకు తమ నిబద్ధతను ప్రదర్శించాలని ఎదురు చూస్తున్నాయి. రష్యా తాలిబన్లను గుర్తించినప్పటికీ, వారి మానవ హక్కుల రికార్డును మెరుగుపరచుకోవాలని తాలిబన్లపై ఇప్పటికీ ప్రపంచవ్యాప్త ఒత్తిడి ఉంది.

# అణు బాంబు తయారీకి సై అంటున్న ఇరాన్..!

- **ఆందోళనలో అమెరికా, ఇజ్రాయెల్**
- **అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అనుమతి లేదు**
- **అణుబాంబులు తయారు చేయాలంటే ఎవరూ ఆపలేరన్న ఖమేనీ**

**టీపీఎన్, ఇరాన్ :**



అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (IAEA)తో సహకరించకూడదని ఇరాన్ నిర్ణయించింది. గత నెలలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ , అమెరికా దాడుల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. IAEAతో సహకారాన్ని రద్దు చేస్తూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఒక చట్టంపై సంతకం చేశారు.

**ఇరాన్ కొత్త చట్టం**

ఇజ్రాయెల్‌తో ఇరాన్ కాల్పుల విరమణకు ఒక రోజు తర్వాత జూన్ 24న ఇరాన్ పార్లమెంట్ IAEAతో సహకారాన్ని ముగించాలని అత్యధికంగా ఓటు వేసింది. ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చిందని అక్కడి మీడియా చెబుతోంది. దీంతో ఇరాన్ అణు కార్యక్రమం ఇకపై అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉండదు. అటువంటి పరిస్థితిలో, ఇరాన్ తన అణు మిషన్‌ను రహస్యంగా కొనసాగించవచ్చు. అణుశక్తిని కలిగి ఉండాలా వద్దా అని మరే ఇతర దేశం తనకు చెప్పకూడదని ఇరాన్ ఇప్పటికే చెప్పేసింది.

**IAEA నుండి విడిపోయిన తర్వాత**

ఇరాన్ పార్లమెంటులో ఆమోదించబడిన తీర్మానం ప్రకారం IAEA నుండి విడిపోయిన తర్వాత దాని ఇన్స్పెక్టర్లు ఇకపై ఇరాన్ అణు కేంద్రాలను తనిఖీ చేయలేరు. దీని అర్థం ఇరాన్ రహస్యంగా తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తే IAEA ఇకపై దాని అణు కార్యక్రమం ఏ స్థాయికి చేరుకుందో దాని గురించి సమాచారాన్ని పొందలేకపోతుంది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్‌లో ఉన్నారని .. వారు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. కానీ వారి కార్యకలాపాలు నిలిపివేశామన్నారు. మా సైట్‌లను యాక్సెస్ చేయడానికి అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఇప్పుడు IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్ అణు కేంద్రాలను చేరుకోవాలనుకుంటే, వారు ఇరాన్ అత్యున్నత సంస్థ అయిన జాతీయ భద్రతా మండలి నుండి అనుమతి తీసుకోవాలి.

**ఇరాన్ అణు బాంబు తయారీ.?**

ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్ , ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడి తర్వాత, ఇరాన్‌లోని 400 కిలోల యురేనియం అదృశ్యమైంది. అది 9 అణు బాంబులను తయారు చేయడానికి తగినంత యురేనియం ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇరాన్ వద్ద ఇప్పటికే తగినంత యురేనియం ఉంది. 60 శాతం వరకు యురేనియంను సుసంపన్నం చేసిందని IAEA ఇప్పటికే తెలిపింది. ఎటువంటి అంతర్జాతీయ పర్యవేక్షణ లేనప్పుడు, ఇరాన్ తన సుసంపన్నత స్థాయిని 90 శాతానికి తీసుకువెళితే, అది అణు బాంబును తయారు చేసే సామర్థ్యాన్ని సాధించగలదు. అయితే ఇందులో ఇంకా చాలా అడ్డంకులు ఉన్నాయి.

**శాంతియుత ప్రయోజనాల కోసమే..**

ఇరాన్ ప్రస్తుతం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (NPT)లో సభ్యదేశంగా ఉంది. ఈ సభ్యత్వం దానికి అణుశక్తిని శాంతియుతంగా ఉపయోగించుకునే హక్కును ఇస్తుంది. కానీ అది అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధిస్తుంది. ఈ హక్కులో యురేనియం సుసంపన్నం, అణు పరిశోధన కూడా ఉన్నాయి. ఆయుధ తయారీ కోసం కానట్లయితే అణు సాంకేతికత, సామగ్రిని యాక్సెస్ చేసే హక్కు దీనికి ఉంది. కానీ ఇలా చేయాలంటే ఇరాన్ తన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగాలంటే IAEA పర్యవేక్షణను అంగీకరించాలి. ఇరాన్ తన అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఎల్లప్పుడూ చెబుతూనే ఉంది. కానీ శాంతియుత అణు పనులకు, 5% యురేనియం సుసంపన్నం సరిపోతుంది. అయితే ఇరాన్ 60% వరకు యురేనియంను సుసంపన్నం చేసింది. అందువల్ల దాని వాదన అనుమానాస్పదంగా ఉంది. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ కూడా తాను బాంబు తయారు చేయాలనుకుంటే, ప్రపంచ నాయకులు తనను ఆపలేరని అన్నారు.

**ఇరాన్ అణు కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తే..**

